# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 34 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు గురువారం 8 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :34 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE THU 8 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## పాతికేళ్ల ప్రజా ప్రస్థానం.. ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం



- 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని కొనియాడిన రాష్ట్ర మంత్రివర్గం
- భారత్ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై పెంచారని ప్రశంస
- దూరదృష్టి, సమర్థ పాలనతో దేశానికి దిశానిర్దేశం చేస్తున్నారని కితాబు
- దేశసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

- మిగతా 2లో

## ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నాం

- కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాలకు భూసేకరణ పూర్తయిందన్న రామ్మోహన్ నాయుడు
- భోగాపురం ఎయిర్‌పోర్టుతో పారిశ్రామికంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ధీమా
- విశాఖ ఎకనామిక్ రీజియన్ త్వరలోనే వాస్తవరూపం దాల్చుతుందన్న కేంద్ర మంత్రి



**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం, కుప్పం, నాగార్జున సాగర్ సమీపంలో, అమరావతి వంటి ప్రాంతాల్లో ఈ నూతన విమానాశ్రయాలు రానున్నాయని చెప్పారు. ఇప్పటికే శ్రీకాకుళం,

- మిగతా 2లో

## ఢిల్లీలో సీఎం చంద్రబాబు.. నిర్మలా సీతారామన్‌తో భేటీ,

# రాష్ట్ర ప్రాజెక్టులపై చర్చ

- ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుపై ప్రధానంగా చర్చ
- రెండు రోజుల పర్యటనలో ప్రధాని, పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం
- విశాఖ మెట్రో, పోలవరం, పుష్కరాల నిధులపై విజ్ఞప్తి చేసే అవకాశం
- నేడు సీఐఐ సదస్సులో పాల్గొననున్న ముఖ్యమంత్రి



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే విషయంలో జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై కేంద్రమంత్రికి వివరించారు. జీహెచ్ హెచ్ ప్రారంభోత్సవానికి వచ్చి ఆ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కేంద్రమంత్రికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర వాటాలకు సంబంధించిన అంశంపైనా వారు చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'విజయవాడ ఉత్సవ్'కు రావాలంటూ నిర్మలను చంద్రబాబు ఆహ్వానించారు.

రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబుకు టీడీపీ ఎంపీలు, నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ పర్యటనలో భాగంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు అనుమతులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రత్యేక నిధులు, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్ర సహకారం వంటి అంశాలపై చంద్రబాబు విజ్ఞప్తి చేయనున్నారు. వీటితో పాటు గోదావరి వరద జలాల సద్వినియోగం, నదుల అనుసంధానంపై కూడా చర్చించనున్నారు.

(అక్టోబర్ 8) మధ్యాహ్నం ఢిల్లీలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్‌లో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి చంద్రబాబు పాల్గొంటారు. పర్యటన ముగించుకుని నేడు రాత్రికి ఆయన తిరిగి అమరావతికి రానున్నారు. ఇదే సందర్భంగా, ప్రధాని మోదీ 25 ఏళ్లుగా నిరంతరాయంగా కార్యనిర్వాహక పదవుల్లో కొనసాగుతున్నందుకు చంద్రబాబు ఆయన నాయకత్వ పటిమను ప్రశంసించారు. స్పష్టమైన దార్శనికత, నిజాయతీ, క్రమశిక్షణే ఆయన విజయానికి కారణమని పేర్కొన్నారు.



## రణరంగంగా మారిన ఢిల్లీ..

## రాహుల్, ప్రియాంక అరెస్ట్..

### బలవంతంగా వాహనంలోకి ఎక్కించిన పోలీసులు

**పెన్ పవర్ డెస్క్:** జంతర్ మంతర్ వద్ద లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని, ప్రియాంకా వాద్రాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , 'ఓట్ చోరీ' ఆరోపణలపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ INDIA కూటమి ఎంపీలు అక్టోబర్ 7న బుధవారం జంతర్ మంతర్ వద్ద నిరసనకు దిగారు.అయితే నిరసనకు అనుమతి లేదంటూ పోలీసులు రాహుల్ ను, విపక్ష ఎంపీలను అడ్డుకున్నారు. ఈక్రమంలో పోలీసులకు ,కాంగ్రెస్ నేతలకు వాగ్వాదం, తోపులాట జరిగింది. తమపై పోలీసులు దాడి చేశారని,

- మిగతా 2లో



## డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్

- ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కార్యాచరణ
- 'ఆపరేషన్ చైతన్యం', 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాల విస్తరణకు ఆదేశం
- డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్
- అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు
- గంజాయి రవాణాపై ఉక్కుపాదం, సరిహద్దుల్లో నిఘా పటిష్ఠం

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. డ్రగ్స్ నిర్మూలనపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు,

- మిగతా 2లో

## ఏపీలో మరో 58 వేల మందికి 'తల్లికి వందనం'.. క్యాబినెట్ నిర్ణయం




- 'తల్లికి వందనం' పథకం విస్తరణకు కేబినెట్ ఆమోదం
- కొత్తగా 58,601 మంది విద్యార్థులకు అందనున్న ప్రయోజనం
- మొత్తం లబ్ధిదారుల సంఖ్య 68 లక్షలు దాటిన వైనం
- దసరా పండుగ లోపు తల్లుల ఖాతాల్లో నగదు జమ

- మిగతా 2లో



## ఖర్గే విందుకు అఖిలేశ్ డుమ్మా..

భవిష్యత్తులో టీ, సమోసాలు తింటూ చర్చిస్తామని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**ఇండియా కూటమి ఐక్యత మరోసారి ప్రశ్నార్థకమైంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం ఏర్పాటు చేసిన విందుకు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ గైర్హాజరయ్యారు. ఈ పరిణామంపై ఆయన చేసిన వ్యాఖ్యలు

- మిగతా 2లో

## డిసెంబర్‌లో మరోసారి రెపో రేటు పెంపు ఉండొచ్చు: ఎస్‌బీఐ రీసెర్చ్

- డిసెంబర్‌లో రెపో రేటు 50 బేసిస్ పాయింట్లు పెరగొచ్చని అంచనా
- తాజాగా 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చిన ఆర్‌బీఐ
- పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ అనిశ్చితి దీనికి ప్రధాన కారణాలు
- డిసెంబర్ నాటికి రెపో రేటు 6 శాతానికి చేరొచ్చన్న ఎస్‌బీఐ రీసెర్చ్




- మిగతా 2లో

## 'రూ.30కోట్ల ఆస్తులు ప్రకటించకపోతే.. అవినీతి అనుకోవాలా?'



**పెన్ పవర్ డెస్క్:** టీవీకే అధినేత, నటుడు విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో సుమారు రూ. 30 కోట్ల విలువైన ఆస్తులు వెల్లడించలేదన్న పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఆస్తుల వివరాలు వెల్లడించకపోవడాన్ని నేరుగా 'అవినీతి

- మిగతా 2లో



## రసాయన శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

- రసాయన శాస్త్రంలో 2026 సంవత్సరానికి నోబెల్ బహుమతి ప్రకటన
- ఫ్రాన్స్ శాస్త్రవేత్త హెన్రీ కగన్, జపాన్ శాస్త్రవేత్త కెన్నో సోయ్‌లకు పురస్కారం
- అణువుల అసమానత, స్వీయ ఉత్ప్రేరణపై పరిశోధనలకు ఈ గౌరవం
- ఔషధాలు, పరిమళాల తయారీలో కీలకం కానున్న ఈ ఆవిష్కరణలు

- మిగతా 2లో

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు: ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు

- రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై అక్టోబర్ 15 నుంచి ఛార్జీలు
- ఈ ఛార్జీల వల్ల లావాదేవీల పరిమాణం తగ్గదని ఆర్బీఐ గవర్నర్ స్పష్టత
- ఈ రుసుముల వల్ల కస్టమర్లపై ఎలాంటి భారం ఉండదని కేంద్రం వెల్లడి
- వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ బదిలీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు

**పెన్ పవర్ డెస్క్:**యూపీఐ ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై స్వల్పంగా విధించనున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వల్ల లావాదేవీల పరిమాణంపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు. అక్టోబర్ 15 నుంచి రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం యూజర్ ఛార్జీ అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన



- మిగతా 2లో




## దేశం పరువు పోయిందిగా..

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థనే ఇబ్బందుల్లోకి నెట్టారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై దేశంలో ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ మరియు న్యాయపరమైన వివాదం నడుస్తోంది. ఆయనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, కొంతమంది పౌర సమాజ కార్యకర్తలు ఆరోపణలు గుప్పిస్తుండగా, కోర్టులలో కూడా పిటిషన్లు దాఖలయ్యాయి.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , సెంట్రలైజ్డ్ సాఫ్ట్‌వేర్ విధానాల వల్ల లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించారంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఎన్నికల సంఘం నిర్ణయాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మిగిలిన కమిషనర్ల అభ్యంతరాలను పక్కనబెట్టారని కొందరు మాజీ బ్యూరోక్రాట్లు, కార్యకర్తలు ఆరోపిస్తూ ఆయనకు "పబ్లిక్ ఇంపీచ్‌మెంట్ నోటీస్" పంపేందుకు ప్రయత్నించారు.

### తక్షణమే పదవి నుంచి వైదొలగాలని...

జ్ఞానేశ్ కుమార్ ను సీఈసీ పదవి నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలంటూ దాఖలైన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత సంస్థ చట్టానికి లోబడే పనిచేస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలను సమీక్షించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది.మరొకవైపు కేంద్ర ఎన్నికల సంఘం తమపై వస్తున్న అంతర్గత విభేదాల వార్తలను ఖండించింది. గత ఏడాది కాలంగా తీసుకున్న నిర్ణయాలన్నీ కమిషనర్లందరి సమ్మతితో ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది.అలాగే పారదర్శకతను పెంచేందుకు వీలుగా సమావేశాల అజెండాలను ముందే పంచుకోవడం, మినిట్స్ విడుదల చేయడం వంటి కొత్త మార్పులను కూడా ఈసీ ప్రకటించింది.

### పదమూడు కోట్ల ఓట్లను...

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ూ×= ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించడం, ఫారమ్-6 నిబంధనలలో మార్పులు చేయడం వంటి కీలక నిర్ణయాలను మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి లు వ్యతిరేకించినప్పటికీ, జ్ఞానేశ్ కుమార్ ఒంటెత్తు పోకడలతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దాదాపు 14 సార్లు సహచర కమిషనర్లు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ వ్యవహారం అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా ఉందంటూ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా ఇండి కూటమి నేతలు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ఒక బహుళ సభ్యుల కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం సహజమని, అంతిమ నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనే జరిగాయని వివరణ ఇచ్చింది. మొత్తం మీద జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థను గబ్బు పట్టించారన్న ఆరోపణలయితే దేశ వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో విపక్షాలు సక్సెస్ అయ్యాయి. జ్ఞానేశ్ కుమార్ మీ తాత, అమ్మమ్మల ఓటర్ల కార్డు ఐడీ నెంబరు చెబుతావా? అంటూ నెట్టింట కామెంట్స్ కూడా పెడుతున్నారు.

# డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్

- మొదటి పేజి తరువాయి

అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఈ సమావేశంలో తీర్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను డ్రగ్స్ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 'ఈగల్ క్లబ్'లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 'ఆపరేషన్ చైతన్యం', విద్యాసంస్థల సమీపంలో 'సేఫ్ క్యాంపస్ జోన్', యువత కోసం 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాల్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నివారణపై ఇతర రాష్ట్రాలతో సమన్వయం కోసం త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించాలని, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణలో పంజాబ్ పోలీసుల అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.

హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ఒడిశా నుంచి గంజాయి రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేశామని, డ్రోన్ల వినియోగాన్ని కూడా పెంచుతామని తెలిపారు. సమాజంలో చైతన్యం తెచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు గుర్తించామని, ఆయా రాష్ట్రాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేశామని, విజయవాడ, రాజమండ్రి నగరాల్లోని బ్లేడ్ బ్యాచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 శిక్షణ పొందిన జాగిలాలను వినియోగిస్తున్నామని, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 192 మంది పాత నేరస్థులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో మరో 58 వేల మందికి 'తల్లికి వందనం'.. క్యాబినెట్ నిర్ణయం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం పరిధిని విస్తరిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పథకం కింద కొత్తగా మరో 58,601 మంది విద్యార్థులను అర్హులుగా చేర్చుతూ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పథకం ద్వారా లబ్ధి పొందే వారి సంఖ్య మరింత పెరగనుంది.

తాజా చేర్పులతో రెండో విడతలో ఆర్థిక సహాయం అందుకునే విద్యార్థుల సంఖ్య 3,29,201కి చేరుకుంటుంది. ఫలితంగా, రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద అర్హులైన మొత్తం విద్యార్థుల సంఖ్య 67,47,190 నుంచి 68,05,791కి పెరగనుంది.

రెండో విడతకు సంబంధించిన నిధులను దసరా పండుగలోపు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం ద్వారా విద్యార్థుల చదువులకు ఆర్థికంగా చేయూత అందించడమే ప్రభుత్వ ఉద్దేశం.

# డిసెంబర్‌లో మరోసారి రెపో రేటు పెంపు ఉండొచ్చు: ఎస్‌బీఐ రీసెర్చ్

రాబోయే డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది.వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే, ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే.ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది. గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ, అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 7.1 శాతానికి, సీపీఐ ద్రవ్యోల్బణం అంచనాను 5.20 శాతానికి పెంచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది.చారిత్రక పరిణామాలను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణం తీవ్రతకు అనుగుణంగానే ఆర్‌బీఐ రెపో రేటు పెంపు ఉంటుందని నివేదిక గుర్తుచేసింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2026 నవంబర్ నాటికి ద్రవ్యోల్బణం 6.8 శాతానికి చేరితే, రెపో రేటును 6 శాతం వరకు పెంచే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

# రసాయన శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

రసాయన శాస్త్రంలో, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 2026 నోబెల్ బహుమతిని ఇద్దరు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. ఫ్రాన్స్‌లోని పారిస్-సడ్ విశ్వవిద్యాలయానికి చెందిన హెన్రీ బి. కగన్, జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్‌కు చెందిన కెన్సో సోయ్‌లకు ఈ గౌరవం దక్కింది. అసమాన సేంద్రియ సంశ్లేషణలో (asymmetric organic synthesis) నాన్-లీనియర్ ఎఫెక్ట్స్, స్వీయ ఉత్ప్రేరణ (ఖఝశీఏఝఖశ్రీఎంఅం) వంటి కీలక ప్రక్రియలను ఆవిష్కరించినందుకు గాను వారిని ఈ పురస్కారం వరించినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది.ప్రకృతిలో అనేక అణువులు, ముఖ్యంగా మన శరీరంలోని అమైనో ఆమ్లాల వంటివి రెండు ప్రతిబింబ రూపాల్లో (mirror-image forms) ఉంటాయి. అయితే, జీవరాశులు కేవలం ఒకే రూపాన్ని వినియోగించుకుంటాయి. ఈ రసాయన అసమానత లేదా 'హోమోకిరాలిటీ' ఎలా సాధ్యమవుతుందనేది శాస్త్రవేత్తలకు శతాబ్దాలుగా ఓ పెద్ద మిస్టరీ. ఈ రహస్యాన్ని ఛేదించడంలో కగన్, సోయ్ చేసిన పరిశోధనలు కీలకపాత్ర పోషించాయి. ఒక రసాయన చర్యలో ఊహించిన దానికంటే ఎక్కువ స్థాయిలో ఒకే ప్రతిబింబ రూపాన్ని ఉత్పత్తి చేయవచ్చని హెన్రీ కగన్ తన పరిశోధనల ద్వారా నిరూపించారు.మరోవైపు కెన్సో సోయ్ స్వీయ ఉత్ప్రేరణ ప్రక్రియను అభివృద్ధి చేసి ఈ రంగంలో మరో ముందడుగు వేశారు. ఈ ప్రక్రియలో ఒక చర్య ద్వారా ఏర్పడిన ఉత్పత్తి, తనంతట తానే ఉత్ప్రేరకంగా పనిచేస్తూ అదే రకమైన అణువుల ఉత్పత్తిని వేగవంతం చేస్తుంది. దీనివల్ల అతి స్వల్ప అసమతుల్యతతో ప్రారంభమైనా, చివరికి దాదాపుగా ఒకే రూపానికి చెందిన అణువులు మాత్రమే ఏర్పడతాయి. ఈ ఆవిష్కరణలు అద్భుతమైనవని, శతాబ్దానికి పైగా ఉన్న రసాయన రహస్యాన్ని ఇది ఛేదించిందని నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే కొనియాడారు. కగన్, సోయ్‌ల పరిశోధనలు సైద్ధాంతికంగానే కాకుండా ఆచరణలో కూడా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఔషధాల తయారీ, సువాసనలు, పరిమళాలు, ఇతర రసాయన పదార్థాల ఉత్పత్తిలో అవసరమైన చర్యలను రూపొందించడానికి వీరి ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ పురస్కారం కింద ఇద్దరు శాస్త్రవేత్తలు 12 మిలియన్ల స్వీడిష్ క్రోనార్ల ప్రైజ్ మనీని పంచుకుంటారు. డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో జరిగే కార్యక్రమంలో వీరికి పతకాలను ప్రదానం చేస్తారు.

# పాతికేళ్ల ప్రజా ప్రస్థానం.. ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందిస్తున్నారని కొనియాడుతూ రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధత, గొప్ప దార్శనికతతో మోదీ దేశానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మంత్రివర్గం ప్రశంసించింది.తన దార్శనికత, స్పష్టమైన లక్ష్యాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారని తీర్మానంలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపిస్తున్నారని మంత్రివర్గం స్పష్టం చేసింది. సృజనాత్మకతకు, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందిస్తున్నారని అభిప్రాయపడింది. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేస్తూ దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపిస్తున్నారని కొనియాడింది.అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధాని మోదీ దేశానికి స్థిరమైన, పటిష్ఠమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని కేబినెట్ వెల్లడించింది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూనే, దేశ ప్రయోజనాలకు

అత్యంత ప్రాధాన్యమిచ్చి అంతర్జాతీయ వేదికలపై భారత్ గౌరవాన్ని ఇనుమడింపజేశారని ప్రశంసించింది. వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా ప్రపంచ దేశాలతో దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ కృషి అనిర్వచనీయమని అభిప్రాయపడింది.

ఆధునిక, సాంకేతిక, స్వయం సమృద్ధి కలిగిన నవభారత నిర్మాణానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తీర్మానం తెలిపింది. మోదీ దార్శనికత, రాజనీతిజ్ఞతతో భారత ప్రగతికి పటిష్ఠమైన పునాదులు పడ్డాయని ఏపీ మంత్రివర్గం అభిప్రాయపడింది. 21వ శతాబ్దం ప్రధాని మోదీ నాయకత్వానిదేనని, దేశసేవలో ఆయన మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని ఆకాంక్షిస్తూ కేబినెట్ తన తీర్మానంలో పేర్కొంది.

# ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నాం

- మొదటి పేజి తరువాయి

కుప్పం ఎయిర్‌పోర్టులకు భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని మంత్రి స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో ఉత్తరాంధ్ర ప్రాంతం ఒక మినీ ఎకనామిక్ సిటీగా రూపాంతరం చెందనుందని కేంద్ర మంత్రి అన్నారు. ఈ ఎయిర్‌పోర్టు ఈ ప్రాంత అభివృద్ధికి ఒక చోదకశక్తిగా పనిచేస్తుందని, వలసలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఉత్తరాంధ్రలో భారీ పారిశ్రామిక అభివృద్ధి జరగనుందని, భోగాపురం విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'విశాఖ ఎకనామిక్ రీజియన్' కూడా త్వరలోనే వాస్తవరూపం దాల్చనుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

## 'రూ.30కోట్ల ఆస్తులు ప్రకటించకపోతే.. అవినీతి అనుకోవాలా?'

- మొదటి పేజి తరువాయి

చర్య'గా పరిగణించవచ్చా? అని న్యాయస్థానం ప్రశ్నించింది.

### ఎన్నిక రద్దు చేయొచ్చా?

విజయ్ తన అఫిడవిట్‌లో దాదాపు రూ.600 కోట్ల ఆస్తులను ప్రకటించారని, మరో రూ.30 కోట్ల ఆస్తులు వెల్లడించలేదని పిటిషనర్ ఆరోపించారు. దీనిపై విచారణ సందర్భంగా న్యాయమూర్తి.. ఒకవేళ ఆస్తుల వివరాలను చార్టర్డ్ అకౌంటెంట్ సిద్ధం చేస్తే, పొరపాటున కొన్ని ఆస్తులు మిగిలిపోతే దాని ఆధారంగా ఎన్నికను రద్దు చేయవచ్చా? అని ప్రశ్నించారు. అలాగే వెల్లడించని ఆస్తుల వివరాల వల్ల పెరంబూర్ ఓటర్ల తీర్పుపై నిజంగా ప్రభావం పడిందా? అనే అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. ఈ కేసులో విజయ్ తన ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని కోరుతున్నారు.

## రణరంగంగా మారిన ఢిల్లీ.. రాహుల్, ప్రియాంక అరెస్ట్..

- మొదటి పేజి తరువాయి

నిరసన ప్రదేశానికి వెళ్లకుండా అడ్డుకున్నారని 'ఇండియా కూటమి ఎంపీలు తెలిపారు. దీంతో రాహుల్ ను పోలీసులు బలవంతంగా వాహనం ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. తమను నిరసన ప్రదేశానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని, తమపై దాడి చేశారని ×చీణ×ూ కూటమి ఎంపీలు ఆరోపించారు. మరోవైపు, నిరసనకు అనుమతి తీసుకోలేదని, కేంద్ర ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో నిరసనలు, సమావేశాలపై ఆంక్షలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు: ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ఈ వ్యాఖ్యలు చేశారు.బుధవారం ద్రవ్య పరపతి విధాన సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కొత్త ఛార్జీల వల్ల యూపీఐ లావాదేవీలు తగ్గుతాయా అని ప్రశ్నించగా, "ప్రస్తుతానికి లావాదేవీల పరిమాణంలో ఎలాంటి తగ్గుదల కనిపించడం లేదు. ఈ స్వల్ప రుసుము వల్ల వాల్యూమ్‌పై పెద్ద ప్రభావం ఉంటుందని నేను వ్యక్తిగతంగా భావించడం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఎండీఆర్‌పై నిర్ణయం ఇప్పటికే తీసుకున్నామని, ఇది యూపీఐ వినియోగాన్ని దెబ్బతీయదని ఆయన వివరించారు.గత ఆరేళ్లుగా నిర్దిష్ట యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు లేవు. గత నెలలో కేంద్ర ప్రభుత్వం రూ. 2,000కు పైబడిన లావాదేవీలపై ఎండీఆర్‌ను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ఈ ఛార్జీలు కేవలం వ్యాపారులకే వర్తిస్తాయని, కస్టమర్లపై ఎలాంటి భారం ఉండదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలోనే స్పష్టం చేశారు. ఈ రుసుము ప్రభుత్వానికి కాకుండా, పేమెంట్ సేవలు అందించే సంస్థలకు చేరుతుందని ఆమె తెలిపారు.ఈ ఛార్జీలకు సంబంధించి కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఉత్పత్తుల వంటి రంగాల్లో రూ. 2,000 దాటిన చెల్లింపులపై ప్రతి లావాదేవీకి రూ. 5 ఫ్లాట్ ఫీజు ఉంటుంది. రూ. 75,000 అంతకంటే ఎక్కువ మొత్తంలో జరిగే లావాదేవీలపై ఎండీఆర్ గరిష్ఠంగా రూ. 300గా నిర్ణయించారు. అయితే, వ్యక్తుల మధ్య (ూ2ూ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎంత మొత్తమైనప్పటికీ ఎలాంటి ఛార్జీలు ఉండవని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ సేవలు యథాతథంగా ఉచితంగానే కొనసాగుతాయి.

## ఖర్గే విందుకు అఖిలేశ్ డుమ్మా..

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి. భవిష్యత్తులో ప్రతిపక్ష నేతల భేటీలు కేవలం భోజనాలకే పరిమితం కావని, టీ తాగుతూ లేదా సమోసాలు తింటూ కూడా చర్చించుకోవచ్చని ఆయన చమత్కరించారు.

జన్‌పథ్‌లోని సాగర్ రత్న హోటల్‌లో ఖర్గే ఏర్పాటు చేసిన విందుకు ఎందుకు హాజరు కాలేదని మీడియా ప్రశ్నించగా అఖిలేశ్ స్పందించారు. "ఇది ఒక్క భోజనంతో ముగిసేది కాదు. భవిష్యత్తులో టీ తాగుతూ సమావేశమయ్యామని కూడా మీరు వినొచ్చు. మేమంతా కలిసి సమోసాలు కూడా తినొచ్చు. చర్చలు కొనసాగుతూనే ఉంటాయి" అని ఆయన వ్యాఖ్యానించారు.అంతకుముందు, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇండియా కూటమి నిర్వహించిన నిరసన ప్రదర్శనలో అఖిలేశ్ యాదవ్ పాల్గొన్నారు. ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న నేతల్లో ఆయన కూడా ఉన్నారు. అయితే, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు ఆకాశవాణి భవన్ వద్ద కొనసాగించిన ధర్నాలో మాత్రం ఆయన పాల్గొనకుండా లక్నోకు తిరిగి వెళ్లారు. బుధవారం నాటి విందుకు, ఆ తర్వాత జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన కార్యక్రమానికి కూడా ఆయన, ఇతర ఎస్పీ ఎంపీలు దూరంగా ఉన్నారు.విందు ఆహ్వానం ఆలస్యంగా అందడం వల్లే అఖిలేశ్ హాజరు కాలేదని సమాజ్‌వాదీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం నాటి నిరసన కార్యక్రమాల్లో చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయాలపై అసంతృప్తి కూడా ఒక కారణంగా తెలుస్తోంది. కాంగ్రెస్ నేతలు మాత్రం ఈ విషయాన్ని తేలికగా తీసుకుంటున్నారు. మంగళవారం నాటి ఘటనల తర్వాత చాలామంది ఎస్పీ ఎంపీలు ఢిల్లీ నుంచి వెళ్లిపోయారని పేర్కొన్నారు. అయితే, 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ, కాంగ్రెస్ మధ్య సమన్వయ లోపం ఉందన్న చర్చకు ఈ పరిణామం మరింత బలాన్నిచ్చింది.

# గిద్దలూరు అభివృద్ధికి, తాగునీటి సమస్యలను పరిష్కరించండి

## మంత్రి నారాయణతో సమావేశం ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 7**

రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, మున్సిపల్ పరిధిలోని మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలపై మంత్రితో చర్చించారు. అలాగే గిద్దలూరు



పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం ట్యాంకర్ ల ద్వారా నీటి సరఫరా చేయుటకు , మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన పనులపై కూడా తగిన నిధులు మంజూరు చేయవలసినదిగా మంత్రి నారాయణ తో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అంశాలపై సానుకూలంగా స్పందించి సహకరించాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# టిడిపి యాదవ నేతల స్ట్రాంగ్ వార్నింగ్

**-2029 ఎన్నికల్లో పోటీ చేసినా మళ్లీ ఓడిస్తాం**

**- ఎమ్మెల్యే ఇంటూరిపై అసత్యాలు ప్రచారం చేయిస్తారా ?**

**-మాకు గుర్తింపు, గౌరవం ఆయన వల్లనే**

**-కక్ష సాధింపులకు మా నాయకుడు దూరం**

**-వైసిపి ప్రభుత్వంలో మాపై అక్రమ కేసులు, వేధింపులు**

**-జేఏసీలు, యూనియన్ల నోళ్లు అప్పుడు తెరవలేదేం ?**

**-ఒంగోలు ధర్నాలో మొత్తం పెయిడ్ ఆర్టిస్టులే**

**-మీడియా సమావేశంలో టిడిపి నేతల ఆగ్రహం**



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 7**

కందుకూరులోని టిడిపి కార్యాలయంలో, పార్టీకి చెందిన యాదవ సామాజిక వర్గం నేతలు బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఇటీవల ఒంగోలులో జరిగిన ధర్నాలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ వారు మాట్లాడారు. కందుకూరు పట్టణంలో వైసిపి నేత దాసరి మాల్యాద్రిపై అక్రమ కేసులు పెట్టాల్సిన అవసరం మా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కి లేదు. ఎన్నికలు నిర్వహించి తద్వారా మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలన్నదే ఆయన ఆలోచన. ఆర్థిక లావాదేవీల కారణంగా వచ్చిన ఫిర్యాదుపై, పోలీసులు విచారించి మాల్యాద్రి, ఆయన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు. దానికి ఎమ్మెల్యే కి సంబంధం ఏంటి ? అని ప్రశ్నించారు. లింగసముద్రం మండలం అన్నెబోయినపల్లి గ్రామంలో గంగమ్మ జాతర విషయంలో ఎమ్మెల్యేపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. అక్కడ రెండు సామాజిక వర్గాల మధ్య చిన్న గొడవ ఉంది. అన్నదమ్ముల్లా కలిసి ఉండే వారిమధ్య కావాలనే విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. గొడవలు లేకుండా ప్రశాంతంగా జాతర జరగాలని ఎమ్మెల్యే కోరుకుంటున్నారు. అంతే తప్ప జాతర ఆపివేయాలని మా నాయకుడు ఎప్పుడూ చెప్పలేదు అని అన్నారు. ఒంగోలు ధర్నాలో మాట్లాడిన మిరియం శ్రీనివాసులు, పదేపదే పార్టీలు మారుస్తూ, విభేదాలు సృష్టించే వ్యక్తి. కులాన్ని అడ్డం పెట్టుకొని పబ్బం గడుపుకునే అవకాశవాది. డబ్బు కోసం గతంలో కులాల కుంపటి రాజేశాడు. అతని చరిత్ర అందరికీ తెలుసు. అలాంటి వ్యక్తికి గుండె ఆపరేషన్ చేయాల్సివస్తే, ఎమ్మెల్యే నాగేశ్వరావు వెంటనే స్పందించి ఎల్ ఓసి ద్వారా 4.26 లక్షల మంజూరుకు సిఫార్సు చేశారు. అలాంటి మంచి మనసున్న వ్యక్తిపై నిందలు వేయడం దారుణం. ఇంకోసారి మా ఎమ్మెల్యే పై మిరియం శ్రీనివాసులు నోరు పారేసుకుంటే కచ్చితంగా బుద్ధి చెప్తాం అని హెచ్చరించారు. గత వైసిపి ప్రభుత్వంలో, నియోజకవర్గంలో టిడిపికి చెందిన సుమారు 20 మంది యాదవ నేతలపై అక్రమంగా కేసులు పెట్టారు, పోలీసుల చేత హింసించారు. వేధింపులు భరించలేక ఊర్లు వదిలిపెట్టి పోయాం. ఆ సమయంలో ఈ జేఏసీ నేతలు ఎక్కడికి వెళ్లారు ? అప్పుడు ఎందుకు స్పందించలేదు ? తోటి సోదరులను ఇబ్బందులు పెడుతుంటే ఒక్కరైనా ముందుకు వచ్చి మాట్లాడారా ? అని ప్రశ్నించారు. వైసిపి ఇన్చార్జి బుర్రా మధుసూదన్, పెయిడ్ ఆర్టిస్టుల చేత ధర్నాలు చేయిస్తున్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని, ఎమ్మెల్యే నాగేశ్వరరావు పట్ల పెరుగుతున్న ప్రజాధరణను చూసి ఓర్చుకోలేక ఇలాంటి చీప్ పాలిటిక్స్ చేస్తున్నారు అని అన్నారు. యాదవులను తెలుగుదేశం పార్టీకి, ఎమ్మెల్యేకు దూరం చేయాలన్న కుట్ర జరుగుతోంది. అందుకు మధుసూదన్ కారణం. గత ఎన్నికల్లో కష్టపడినట్లుగానే, ఈసారి కూడా మరింత కష్టపడి ఎమ్మెల్యేగా నాగేశ్వరరావును గెలిపించుకుంటాం. అంతేతప్ప ఒకరికి లొంగే పరిస్థితి లేదు. యాదవులంతా తనకే సపోర్ట్ చేస్తారని మధుసూదన్ కలలు కంటున్నారు. అది జరగని పని. 2029లో ఆయన పోటీ చేస్తే మళ్లీ ఓడిస్తాం అని అన్నారు. వైసీపీలోని యాదవ కుటుంబాలకు మా విజ్ఞప్తి ఏమిటంటే... ఆ పార్టీలో మీకు గౌరవం ఉండదు. రాజకీయంగా ఎదగనివ్వరు. పైగా అవమానాలు ఎదురవుతాయి. బుర్రా మాటలు విని మోసపోవద్దు. మీరంతా టిడిపిలోకి రండి. సాదరంగా ఆహ్వానిస్తాం. కలిసి అభివృద్ధిలోకి నడుద్దాం. మన మాలకొండ చైర్మన్... ఇంకా అనేక పదవుల్లో ప్రాధాన్యత బీసీలను గౌరవించి, గుర్తింపు నిచ్చే ఏకైక పార్టీ తెలుగు దేశం మాత్రమే అని అన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మొదటినుంచి బీసీ పక్షపాతి. అందు లోనూ యాదవులకు రాజకీయంగా, ఆర్థికంగా ఎన్నో అవకాశాలు కల్పించారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, ఇద్దరికి మండల పార్టీ అధ్యక్షులు, ఏఎంసీ వైస్ చైర్మన్, నాలుగు డైరెక్టర్ పదవులు, మాలకొండ చైర్మన్... ఇంకా అనేక పదవుల్లో ప్రాధాన్యత ఇచ్చిన గొప్ప వ్యక్తి. ఇంతకంటే ఏ ప్రభుత్వంలో మనకు న్యాయం జరిగిందో ఆలోచించండి. 40 ఇయర్స్ ఇండస్ట్రీ పాలనలో ఎప్పుడైనా మనల్ని ఉన్నత పదవుల్లో కూర్చోబెట్టారా ? తగిన గుర్తింపు ఇచ్చారా ? యాదవ సోదరులందరూ ఒక్కసారి ఆలోచించండి అని అన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరావు పై బురదజల్లే పని మానుకోవాలని బుర్రా మధుసూదన్ ను గట్టిగా హెచ్చరిస్తున్నాం. ఎవరి హయాంలో యాదవులకు నష్టం జరిగిందో, ఎవరి హయాంలో యాదవులకు గుర్తింపు వచ్చిందో చర్చించడానికి మేము సిద్ధం. ఆయన ఇకనైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి. ఎమ్మెల్యే పై అవాస్తవాలు మాట్లాడితే ఊరుకోం. మధుసూదన్ యాదవ్ ను గ్రామాల్లో తిరగకుండా చేస్తాం అని టిడిపి నేతలు ఘాటుగా హెచ్చరించారు. ఈ సమావేశంలో గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, ఉలవపాడు మండల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, ఏఎంసి వైస్ చైర్మన్ పొట్టేళ్ల మురళి, డైరెక్టర్ అమ్మనబ్రోలు మాధవ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మద్దసాని మహేంద్ర, క్లస్టర్ ఇన్చార్జులు చిత్తారి మల్లికార్జున, పోలుబోయిన శ్రీను, పట్టణ నాయకులు సవిడిబోయిన వెంకటకృష్ణ, గుమ్మా శివ, ముచ్చు వేణు, పీలా శ్రీను, మొనపాటి సుబ్బరాజు, గుమ్మడి బ్రహ్మయ్య, సాయి, వలేటివారిపాలెం మండల నాయకులు పెగడ శ్రీను, సాదం సుబ్బారావు, లింగసముద్రం మండల నాయకులు ఎందేటి కోటేశ్వరరావు, నారిబోయిన నారాయణ, వీరనారాయణ, లోమడ ప్రసాద్, కొల్లిబోయిన మనోజ్, బొజ్జా శ్రీను, గుడ్లూరు మండల నాయకులు మేకల మాల్యాద్రి, తిరుపతి వెంకయ్య, పోలుగంగు కృష్ణ, ఉలవపాడు మండల నాయకులు రాచగర్ల శివ, జాజుల రవి, అమ్మనబ్రోలు రమేష్, హనుమంతరావు, హరిబాబు, గొత్తుల జనార్ధన్, మర్రిబోయిన వెంకయ్య, ఎందేటి శ్రీను, ప్రసాదు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణి సంరక్షణ అందరి బాధ్యత

# కలెక్టర్ విజయ సునీత

### 2కే రన్ ను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 7**





ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర అటవీశాఖ ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాలు-2026 లో భాగంగా బుధవారం మార్కాపురం పట్టణంలో 2కే రన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కంభం బస్టాండ్ సమీపంలో ఉన్న జిల్లా అటవీశాఖ కార్యాలయం వద్ద నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు నిర్వహించిన ఈ 2కే రన్ కార్యక్రమాన్ని మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి .జిల్లా అటవీశాఖ అధికారి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన వారు రన్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత గారు మాట్లాడుతూ వన్యప్రాణులను, అడవులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల ఉద్దేశం ప్రజల్లో అవగాహన కల్పించడమేనని, అడవులు, వన్యప్రాణులు ఉంటేనే పర్యావరణ సమతౌల్యం కాపాడబడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వన్యప్రాణి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా 2కే రన్ లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వన్యప్రాణులను, అడవులను కాపాడుకోవాలన్నారు. తద్వారా ప్రకృతి సమతౌల్యం దెబ్బతినకుండా సకాలంలో వర్షాలు పడతాయని, దానివల్ల రైతులకు, ప్రజలందరికీ మేలు జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం అటవీ సంరక్షణకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి మాట్లాడుతూ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, రన్ లు నిర్వహిస్తున్నామని తెలిపారు. వన్యప్రాణుల వేటను అరికట్టడంలో ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, విద్యార్థులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### -ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ పి. రాజాబాబు





**జరుగుమల్లి పెన్ పవర్, అక్టోబర్ 7**

ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జరుగుమల్లి మండలంలోని నర్సింగోలు గ్రామానికి రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు బుధవారం పరిశీలించారు. రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణతో కలిసి హెలిప్యాడ్, ప్రజా వేదిక, ముఖ్యమంత్రి పార్టీ కార్యకర్తలతో నిర్వహించనున్న సమావేశానికి సంబంధించిన సభా ప్రాంగణాలను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వివిధ శాఖలకు ప్రత్యేక బాధ్యతలు కేటాయించామని, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పర్యటన ఏర్పాట్ల సమన్వయ అధికారిగా ఆర్డీఓను నియమించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశి, ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, స్వర్ణ అవార్డు సచివాలయాల అధికారి వెంకటేశ్వరరావుతో పాటు వివిధ శాఖల జిల్లా, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# చైర్మన్ సీటు ఓకే.. వార్డు సీటు నోకే..!

**చైర్మన్ పదవిపై పెరుగుతున్న ఆశావాహులు**

**- కౌన్సిలర్ బరిలోకి దిగేందుకు వెనకడుగు**

**- నేరుగా చైర్మన్ ఎన్నికతో పదవిపై పెరిగిన ఆసక్తి**

**- కౌన్సిలర్‌గా గెలిచినా రాజకీయంగా ప్రయోజనం ఏమిటంటున్న ఆశావాహులు**

**- ఎన్నికల ఖర్చు భరిస్తేనే బరిలోకి వస్తామంటూ పార్టీ పెద్దలకు తేల్చిచెబుతున్న వైనం**

**- ఇరు ప్రధాన పార్టీల్లోనూ అభ్యర్థుల ఎంపిక కసరత్తుకు కొత్త చిక్కులు**





**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 07**

మున్సిపల్ ఎన్నికల సమరం సమీపిస్తున్న కొద్దీ పట్టణాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ప్రధాన రాజకీయ పార్టీలు చైర్మన్ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారిస్తుండగా.. మరోవైపు వార్డుల వారీగా బలమైన అభ్యర్థులను రంగంలోకి దించడంపై కసరత్తు చేస్తున్నాయి. అయితే ఈసారి పార్టీలకు మరో కొత్త సమస్య ఎదురవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. చైర్మన్ పదవికి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న వారు చాలామందే ఉన్నా.. కౌన్సిలర్‌గా వార్డుల్లో పోటీ చేసేందుకు మాత్రం ఆశావాహులు వెనుకడుగు వేస్తున్నారనే ప్రచారం ఊపందుకుంది.

**చైర్మన్ పదవికే ఎందుకింత ఆసక్తి..**

చైర్మన్ పదవికి ప్రజలే నేరుగా ఓటు వేసే విధానం ఉండటమే ఇందుకు ప్రధాన కారణంగా ఆశావాహులు చెబుతున్నట్లు సమాచారం. ప్రజల నుంచి నేరుగా మద్దతు పొందే అవకాశం ఉండటంతో చైర్మన్ పదవిని రాజకీయంగా కీలకంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయా పార్టీల్లో చైర్మన్ అభ్యర్థిత్వం కోసం పలువురు నాయకులు ఇప్పటికే తమ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. పార్టీ పెద్దలను కలవడం, స్థానికంగా తమ బలాన్ని చాటుకోవడం, అనుచరులతో సమావేశాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. అయితే ఇదే సమయంలో వార్డుల విషయంలో మాత్రం సీన్ రివర్స్ అవుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**కౌన్సిలర్‌గా గెలిచి ఏం చేయాలి..:** వార్డు స్థాయి ఆశావాహుల్లో కొందరు ఇదే ప్రశ్నను లేవనెత్తుతున్నట్లు తెలుస్తోంది. కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలిచినప్పటికీ తమకు ఉన్న రాజకీయ ప్రాధాన్యత పరిమితంగానే ఉంటుందని, పైగా ఎన్నికల్లో భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని వారు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ప్రచారం, కార్యకర్తల నిర్వహణ, ఇతర ఖర్చులు కలిపి ఆర్థిక భారం పెరుగుతుందని ఆశావాహులు చెబుతున్నట్లు తెలుస్తోంది. గెలిచినా ఖర్చు.. ఓడినా ఖర్చు.. మరి అంత డబ్బు ఎందుకు పెట్టాలి అనే ధోరణి కొందరు ఆశావాహుల్లో కనిపిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**ఖర్చు మీది అయితేనే పోటీ..**

ఇప్పటికే కొందరు ఆశావాహులు తమ నిర్ణయాన్ని పార్టీ ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకుల వద్ద స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. పార్టీ నుంచి ఆర్థిక సహకారం ఉంటేనే పోటీ చేస్తాం. సొంత డబ్బుతో మాత్రం బరిలోకి దిగలేం అని కొందరు తేల్చి చెబుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో వార్డుల వారీగా అభ్యర్థులను ఖరారు చేయడం పార్టీ నాయకత్వానికి అంత సులభంగా మారడం లేదనే చర్చ మొదలైంది.

**ఇరు పార్టీలకూ ఒకటే సమస్య..**

పట్టణంలో ప్రధానంగా పోటీ పడే ఇరు రాజకీయ పార్టీల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందని స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. చైర్మన్ అభ్యర్థి విషయంలో పోటీ పడేందుకు పలువురు ముందుకు వస్తుండగా.. ప్రతి వార్డులో పార్టీ తరఫున బలమైన అభ్యర్థిని నిలబెట్టడం మాత్రం నాయకత్వానికి సవాల్‌గా మారుతోందని తెలుస్తోంది. ఒకవైపు మాకు అవకాశం ఇవ్వండి అంటూ చైర్మన్ పదవి కోసం ఆశావాహులు పోటీ పడుతుంటే మరోవైపు ఖర్చు ఎవరు భరిస్తారు అంటూ వార్డు స్థాయి ఆశావాహులు ప్రశ్నిస్తున్న పరిస్థితి నెలకొందనే చర్చ వినిపిస్తోంది.

**చైర్మన్ గెలుపు కోసం వార్డులే కీలకం..**

అయితే చైర్మన్ పదవికి నేరుగా ఎన్నిక జరిగే పరిస్థితి ఉన్నప్పటికీ.. పట్టణంలోని ప్రతి వార్డులో పార్టీకి ఉండే రాజకీయ బలం కూడా కీలకమే. అందుకే చైర్మన్ అభ్యర్థులతో పాటు వార్డు స్థాయిలో బలమైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు పార్టీలు ప్రయత్నించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో వార్డుల్లో పోటీ చేసేందుకు ఆశావాహులు వెనుకడుగు వేస్తే పార్టీలు ఎలాంటి వ్యూహాన్ని అనుసరిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

**ఎన్నికల ఖర్చే అసలు సమస్యా..**

కౌన్సిలర్ పదవిపై ఆసక్తి తగ్గడానికి కేవలం అధికారాల అంశమే కారణమా, లేక ఎన్నికల ఖర్చు భారం ప్రధాన కారణమా, అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొంతమంది మాత్రం స్థానికంగా కౌన్సిలర్ పదవికి ఉండే ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని పోటీకి సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీంతో అన్ని వార్డుల్లోనూ ఒకే రకమైన పరిస్థితి ఉందని చెప్పలేమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఖర్చు విషయంలో పార్టీ నుంచి స్పష్టమైన భరోసా కావాలని కొందరు ఆశావాహులు కోరుతున్నారనే విషయం మాత్రం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

**నేతలకు ముందున్న అసలు పరీక్ష..**

మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే నాటికి ఈ పరిస్థితుల్లో మార్పు వస్తుందా? లేక ఇదే ధోరణి కొనసాగుతుందా? అనేది చూడాలి. చైర్మన్ అభ్యర్థిని ఎంపిక చేయడం ఒక ఎత్తయితే.. ప్రతి వార్డులో బలమైన అభ్యర్థులను నిలబెట్టడం మరో ఎత్తుగా మారింది. ముఖ్యంగా ఎన్నికల ఖర్చు విషయంలో ఆశావాహుల డిమాండ్లను పార్టీలు ఎలా పరిష్కరిస్తాయన్నది ఇప్పుడు కీలకంగా మారింది. చైర్మన్ పీఠం కోసం పోటీ పడుతున్న ఆశావాహులను సముదాయించడం కంటే.. వార్డుల్లో పోటీకి సిద్ధంగా ఉన్న అభ్యర్థులను వెతకడమే పార్టీలకు పెద్ద సవాలుగా మారుతుందా, అన్న చర్చ పట్టణ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# ఘనంగా అంగన్వాడీ ఉత్సవం




**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 7**

పట్టణంలోని రెవెన్యూ కాలనీ లోని అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ సూపర్వైజర్ ప్రభావతి పర్యవేక్షణలో పోషణ మాసం సందర్భంగా అంగన్వాడీ ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సమతుల్యమైన మరియు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. పిల్లల ఆరోగ్యం, పోషణ, పరిశుభ్రతపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గర్భిణీ స్త్రీ పి.శివన్యకు సాంప్రదాయబద్ధంగా చీర, సారె అందించి శ్రీమంతం నిర్వహించారు. అలాగే అంగన్వాడీ టీచర్ బి.వి. పుష్పలత, ఆయా విజయ అందిస్తున్న సేవలను గుర్తించి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఏ. సునీత, డి. ఈశ్వరమ్మ, కె. రోహిణి, సుజాత, భారతీయ జనతా పార్టీ ప్రకాశం జిల్లా కార్యవర్గ సభ్యులు మన్నేపల్లి వరప్రసాదరావు, కాలనీకి చెందిన చిన్నారుల తల్లులు, ఇతరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం

**-రెవిన్యూ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మహా కార్యక్రమం**



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 7**

కందుకూరు ఏ సెక్టార్‌లోని రెవిన్యూ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో 9వ రాష్ట్రీయ పోషణ మహా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ ఉషారాణి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ యు. ప్రభావతి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి బీజేపీ నేత ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, తల్లులకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, బాలసంజీవని కిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కిట్‌లో అందించే రాగిపిండితో జావ తయారు చేసుకుని తీసుకోవడం వల్ల పోషక విలువలు లభిస్తాయని వివరించారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం ద్వారా అర్హత కలిగిన గర్భిణులకు అందుతున్న ఆర్థిక సహాయంపై కూడా అవగాహన కల్పించారు. మొదటి కాన్పుకు రూ.5,000 రెండు విడతల్లో, రెండో కాన్పులో ఆడ శిశువు జన్మిస్తే రూ.6,000 రెండు విడతల్లో ఆర్థిక సహాయం అందుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ గర్భిణి పి. శివన్యకు చీర అందించి సన్మానించారు. అలాగే అంగన్వాడీ టీచర్ బి. పుష్పలత, ఆయా విజయకుమారిలను శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, తల్లులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

# సి ఎస్ పురం లో టిడిపి నాయకుల సమీక్ష సమావేశం



**సిఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 7**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం టిడిపి కార్యాలయంలో కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ సూచనలతో యూనిట్ 16 పరిధిలోని అంబవరంకొత్తపల్లి, బోయమడుగుల, అరివేముల, ఏకునాంపురం పంచాయతీల గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే పార్టీ కార్యక్రమాల్లో భాగంగా సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల వారీగా పార్టీ పరిస్థితి, కార్యకర్తల సమన్వయం, బూత్ స్థాయి కార్యక్రమాల నిర్వహణతో పాటు రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి కోనంగి వెంకట కొండయ్య, యూనిట్ ఇన్చార్జి షేక్ నాగూర్ వలి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, ఎస్సీ సెల్ అధ్యక్షులు కెవి ఏసురత్నం, ఆయా పంచాయతీల గ్రామ పార్టీ అధ్యక్షులు బూత్ కన్వీనర్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు కొమరోలు మండలంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సుడిగాలి పర్యటన

**పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు -మండలంలోని కూటమి పార్టీల**

**నేతలు,కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని ముత్తుముల సంజీవరెడ్డి, బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ పిలుపు**







**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 7**

గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఈనెల 8వ తేదీ గురువారం కొమరోలు మండలంలో సుడిగాలి పర్యటన చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారని కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి,కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు. గురువారం ఉదయం 8:30 గంటలకు గిద్దలూరులో బయలుదేరనున్న గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఉదయం 9 గంటలకు రాజుపాలెం గ్రామం చేరుకుని రాజుపాలెం నుంచి పాయలపల్లె వరకు గల గ్రావెల్ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన పనులకు శంకుస్థాపన చేయనున్నారని వారు తెలిపారు. అక్కడి నుంచి ఉదయం 10 గంటలకు బాదినేనిపల్లి గ్రామం చేరుకుని ఆ గ్రామంలో నిర్మించ తలపెట్టిన గ్రామపంచాయతీ కార్యాలయానికి శంకుస్థాపన చేయనున్నట్లుగా వారు చెప్పారు. ఉదయం 11 గంటలకు సురవారిపల్లి పంచాయతీలోని బొడ్డువానిపల్లి గ్రామానికి చేరుకుని ఆ గ్రామంలో ఏర్పాటు చేయనున్న సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారని, అక్కడి నుంచి ఉదయం 11:30 కు అల్లినగరం పంచాయతీలోని వట్టి వేపమానుపల్లి గ్రామానికి చేరుకొని ఆ గ్రామంలో నిర్మించ తలపెట్టిన సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్నారని వారు వివరించారు. మధ్యాహ్నం 12 గంటలకు బ్రాహ్మణపల్లి పంచాయతీలోని మిట్టమీదిపల్లి గ్రామానికి చేరుకుని ఆ గ్రామంలో నిర్మించ తలపెట్టిన సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారని, మధ్యాహ్నం 12:30 కు కొమరోలు చేరుకొని కొమరోలు లోని మూడు వీధులలో నిర్మించ తలపెట్టిన సిమెంట్ రోడ్లు శంకుస్థాపన చేయనున్నట్లుగా వారు పేర్కొన్నారు. మధ్యాహ్నం కొమరోలు లోని సంజీవరెడ్డి నివాసగృహంలో భోజనం ముగించుకుని 2:00 గంటలకు తాటిచెర్ల గ్రామం చేరుకొని ఆ గ్రామంలో నిర్మించ తలపెట్టిన సిమెంట్ రోడ్డు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి శంకుస్థాపన చేస్తారని వారు పేర్కొన్నారు. కావున కొమరోలు మండలంలోని కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్చార్జీలు, మండల కన్వీనర్లు,కో కన్వీనర్లు, అభిమానులు కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కొమరోలు మండల పర్యటనను విజయవంతం చేయాలని ముత్తుముల సంజీవరెడ్డి, బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ విజ్ఞప్తి చేశారు.

# చాకలి పాలెం అంగన్వాడీ కేంద్రంలో పోషణ మహా, అంగన్వాడీ ఉత్సవం



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 7**

చాకలి పాలెం అంగన్వాడీ కేంద్రంలో పోషణ మహా 2026, అంగన్వాడీ ఉత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ ఉషారాణి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ షకీలా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ షకీలా మాట్లాడుతూ "మన అంగన్వాడీ--మన బాధ్యత" అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్న పోషణ మహా కార్యక్రమం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆహారంలో వైవిధ్యాన్ని పాటిస్తూ తగినంత ప్రొటీన్ తీసుకోవడం, ఆకుకూరలు, కూరగాయలను నిత్య ఆహారంలో చేర్చుకోవడం, చిన్నారులకు వేడి తాజా వంటకాలను అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆరు నెలలు నిండిన శిశువులకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారాన్ని తప్పనిసరిగా అందించాలని సూచించారు. బాల్యదశలో మెదడు అభివృద్ధికి పోషకాహారం, సంరక్షణ ఎంతో కీలకమని తెలిపారు. ఆరు సంవత్సరాల వయస్సు నాటికి మెదడు అభివృద్ధిలో 85 శాతానికి పైగా పూర్తవుతుందని, ముఖ్యంగా జీవితంలోని తొలి 1,000 రోజుల్లో అత్యంత వేగంగా అభివృద్ధి జరుగుతుందని వివరించారు. శిశువులకు ఆహారం అందించే పద్ధతులు, ఆహార వైవిధ్యం, ప్రసవపూర్వ సంరక్షణ, చేతుల పరిశుభ్రత, సంస్థాగత ఆరోగ్య సంరక్షణ వంటి అంశాల్లో సుస్థిరమైన ప్రవర్తనా మార్పులు తీసుకురావడానికి సమాజ భాగస్వామ్యం, బాధ్యతాయుతమైన యాజమాన్యం అవసరమని పేర్కొన్నారు. అంగన్వాడీ మేనేజ్‌మెంట్ కమిటీల ద్వారా సమాజ భాగస్వామ్యాన్ని పెంపొందించడంతో పాటు చిన్ననాటి సంరక్షణ, విద్య పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.అంగన్వాడీ కేంద్రాలు, లబ్ధిదారుల సేవలను పోషణ్ ట్రాకర్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. అలాగే ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం ప్రాధాన్యతను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం. బేబీ ఝాన్సీ, ఎన్. మాధవి, బి. సునీత, ఎం. అంజలి, దామ అనూష, ఎం. రమాదేవి తదితరులతో పాటు పలువురు తల్లులు పాల్గొన్నారు.

# మూడో రోజుకు చేరిన కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది ఆందోళన

**జీజీహెచ్‌లో నిలిచిన ల్యాబ్, స్కానింగ్, ఎక్స్-రే సేవలు ఇబ్బందుల్లో రోగులు**



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 7**

మార్కాపురం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) లో కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బంది చేపట్టిన ఆందోళన బుధవారం మూడో రోజుకు చేరింది. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, 100 శాతం గ్రాస్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఎంహెచ్ సీ జేఏసీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విధులను బహిష్కరించి జీజీహెచ్ ఆవరణలో ధర్నాకు దిగారు. మార్కాపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన ల్యాబ్ టెక్నీషియన్లు, స్కానింగ్, ఎక్స్-రే, స్టాఫ్ నర్సులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. మా సేవలు కావాలి.. మా బతుకులు మార్చండి అంటూ నినాదాలు చేశారు.

**కరోనా నుంచి నేటి వరకు మా సేవలు వాడుకుంటున్నారు - ఆవేదనలో సిబ్బంది**

ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించిన తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరాల తరబడి తక్కువ వేతనంతో పని చేస్తున్నామని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**రోగులకు తప్పని ఇబ్బందులు..**

సిబ్బంది సమ్మెతో జీజీహెచ్ లో ల్యాబొరేటరీ, స్కానింగ్, ఎక్స్-రే సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని సేవలను బహిష్కరించడంతో ఓపీ వద్ద రోగుల రద్దీ పెరిగింది. పరీక్షల కోసం వచ్చిన రోగులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని, ప్రైవేటు ల్యాబ్ లకు వెళ్లాల్సి వస్తోందని రోగుల బంధువులు వాపోయారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, జిల్లా వ్యాప్తంగా వచ్చిన వందలాది మంది కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# 12వ పిఆర్సి మేరకు జీతాలు ఇవ్వాలి

**- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ డిమాండ్**




**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 07**

11వ పిఆర్సి ముగిసి ఐదు సంవత్సరాలు పూర్తి అయి 12వ పిఆర్సి కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఈ పి ఆర్ సి ప్రకారం మునిసిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు జిల్లా విస్తృత సమావేశం ఒంగోలు సిఐటియు కార్యాలయంలో బుధవారం ఉసరపాటి శామ్యూల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపాలిటీలలో నీతి ఆయోగ్ పేరుతో ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని,కార్మికులందరికీ చట్ట ప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ 12వ పి ఆర్ సి ని మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని , పెరిగిన ధరలతో ఇంటి అద్దెలు చెల్లించలేక కరెంట్ చార్జీలు కట్టలేక మున్సిపల్ కార్మికులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు టి. విజయమ్మ, జి. నరసింహం, ఎం లక్ష్మీకాంతం, కే. సాల్మన్, ఏం బాబు, కే వెంకటేశ్వర్లు, భారతి, ఊసరపాటి సామ్యూల్, పి ఏడుకొండలు, టీ పిచ్చయ్య, ఆమని, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

# యునెస్కో కూచిపూడి వారసత్వ వర్క్‌షాప్‌లో ఒంగోలు కళాకారుల ప్రతిభ




**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 07**

కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠంలో సెప్టెంబర్ 6, 7 తేదీలలో యునెస్కో ఆధ్వర్యంలో కూచిపూడి కళా వారసత్వంపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఒంగోలుకు చెందిన శ్రీ నళినీ ప్రియ కూచిపూడి నృత్య నికేతన్ ప్రిన్సిపాల్ ఎస్.వి. శివకుమారితో పాటు ఆమె శిష్యులు ఫణికుమార్, వందన, వర్షిణి, ప్రతీక పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో భాగంగా ప్రముఖ కూచిపూడి గురువు డా. వేదాంతం రామలింగ శాస్త్రి నృత్య దర్శకత్వంలో ప్రదర్శించిన నర్తనశాల కూచిపూడి నృత్య రూపకంలో ఎస్.వి. శివకుమారి స్వదేశ్ణ పాత్రను పోషించి తన ప్రతిభను చాటుకున్నారు. కూచిపూడి కళా సంప్రదాయం, నృత్య రూపకాలు, వర్క్‌షాప్‌లోని వివిధ కార్యక్రమాలను యునెస్కో ప్రతినిధులు చిత్రీకరించారు. కూచిపూడి గ్రామాన్ని కళా వారసత్వ గ్రామంగా గుర్తింపు పొందే దిశగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమం మొత్తం మచిలీపట్నం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కూచిపూడి కళకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో భాగంగా నిర్వహించిన ఇంతటి బృహత్తరమైన కార్యక్రమంలో ఒంగోలుకు చెందిన కళాకారులు పాల్గొనడం ఎంతో గర్వకారణమని, అదృష్టంగా భావిస్తున్నామని ఎస్.వి. శివకుమారి తెలిపారు. కూచిపూడి కళా వారసత్వ పరిరక్షణకు, భావితరాలకు ఈ కళను అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు.

# వి బైలులో కోళ్ల ఫారంను ప్రారంభించిన రంగాపురం రత్తయ్య

**ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు**

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 7**

మండలంలోని వి. బైలు గ్రామానికి చెందిన నాగిశెట్టి శ్రీను, తిరుపాలు ఏర్పాటు చేసిన టిఎస్ పోలేరమ్మ తల్లి కోళ్ల ఫారాన్ని కోనసీమ ప్రాంతం రంగాపురానికి చెందిన కోళ్ల ఫారాల అధినేత రంగాపురం రత్తయ్య బుధవారం ప్రారంభించారు. అనంతరం రంగాపురం రత్తయ్య భైరవకోనను సందర్శించారు. అక్కడ త్రిముఖ దుర్గాదేవి అమ్మవారిని, కాలభైరవేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని వివిధ శివలింగాలను దర్శించుకుని స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. రంగయ్యకు కోళ్ల ఫారం అధినేత శ్రీను వెంకటేశ్వర స్వామి మెమెంటోను అందజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి నాగిశెట్టి చిన్న మాలకొండయ్య , మన్నేపల్లి కార్తీక్, పునుగుపాటి రవికుమార్, నాగిశెట్టి తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.



# కొమరోలు మండలంలో పంచాయతీరాజ్ రోడ్లకు మహర్దశ

### గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు.

### అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపనలు చేయనున్న గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి.





**కొమరోలు పెన్ పవర్ అక్టోబరు 7**

కొమరోలు మండలంలోని పలు గ్రామపంచాయతీలలోని గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టుటకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు అయ్యాయని ,సదరు పనులను గురువారం గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నారని కొమరోలు పంచాయతీరాజ్ ఏఈ జి ఈరయ్య తెలిపారు. కొమరోలు మండలం రాజుపాలెం నుంచి పాయలపల్లె వరకు గల గ్రావెల్ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేయుటకు 2.5 కోట్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. కొమరోలు నుంచి పురుషోత్తమునిపల్లి బొంతపల్లి రాతిరెడ్డిపల్లి మలికే పల్లె మీదుగా కొమరోలు- సింగర పల్లె (కేఎస్) ఆర్ అండ్ బి రోడ్డు వరకు గల రోడ్డు అభివృద్ధికి మూడు కోట్ల రూపాయలు, కడప- అమరావతి జాతీయ రహదారి నుంచి అల్లినగరం పంచాయతీలోని వట్టివేపమానుపల్లె వరకు గల రోడ్డును అభివృద్ధి చేయుటకు 75 లక్షలు, సూరవారిపల్లె పంచాయతీలోని బొడ్డువాని పల్లె నుంచి రెడ్డి చర్ల పంచాయతీలోని గుంతపల్లె వరకు రోడ్డు అభివృద్ధికి కోటి 50 లక్షలు. మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. బ్రాహ్మణపల్లి పంచాయతీలోని మిట్టమీదిపల్లి నుంచి రెడ్డి చర్ల వరకు రోడ్డు అభివృద్ధికి 40 లక్షల రూపాయలు, కడప అమరావతి జాతీయ రహదారి వద్ద నుంచి తాటిచెర్ల గ్రామం వరకు రోడ్డు అభివృద్ధికి 69 లక్షల రూపాయలు మంజూరయ్యాయని,వాటితో పాటు కొమరోలు పట్టణంలోని మూడు వీధులలో సిమెంట్ రోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి గురువారం కొమరోలు మండలంలో సుడిగాలి పర్యటన చేసి సదరు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారని పంచాయతీరాజ్ ఏఈ వీరయ్య పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధే దేశా భివృద్ధిగా భావించిన శాసనసభ్యులు అశోక్ రెడ్డి గ్రామాలలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. కావున ఈనెల 8వ తేదీ గురువారం కొమరోలు మండలంలోని గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్న శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పర్యటనను, శంకుస్థాపన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన ప్రజలకువిజ్ఞప్తి చేశారు.

## మురుగు కాలువల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

### 20 మంది అదనపు కార్మికుల నియామకం



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 07**

గిద్దలూరు పట్టణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మురుగు కాలువలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని మురుగు కాలువల శుభ్రత కోసం దినసరి వేతన ప్రాతిపదికన 20 మంది అదనపు పారిశుధ్య కార్మికులను నియమించారు. పట్టణంలోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడిక, వ్యర్థాలను తొలగించి నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని, పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని వాటర్ బోర్డు కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సూచించారు. ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాహాన్ షా వలి,నంది శ్రీనివాసులు, దుత్తా బాల ఈశ్వరయ్య, లొక్కు రమేష్, మండ్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అందుకున్న కమిషనర్ రమణబాబుకు అభినందనలు

### ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ నెల 2 న అవార్డు ప్రదానం - గిద్దలూరుకు గర్వకారణం

### స్వర్ణ వార్డు సిబ్బంది ఘన సన్మానం



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 07**

రాష్ట్రస్థాయి స్వచ్ఛఆంధ్ర - స్వచ్ఛ మున్సిపాలిటీ” అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్న గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణబాబు కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రతిష్టాత్మక అవార్డు గిద్దలూరు మున్సిపాలిటీకి దక్కడం పట్టణ ప్రజలకు గర్వకారణంగా నిలిచింది. పారిశుధ్య నిర్వహణలో, పరిశుభ్రత కార్యక్రమాల అమలులో గిద్దలూరు మున్సిపాలిటీ చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందన్నారు. ఈ సందర్భంగా గిద్దలూరు స్వర్ణ వార్డు సిబ్బంది కమిషనర్ రమణబాబు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అవార్డు సాధనలో భాగస్వామ్యమైన ప్రతి ఒక్క పారిశుధ్య కార్మికుడి కృషిని కమిషనర్ ఈ సందర్భంగా అభినందించారు. స్వచ్ఛ గిద్దలూరు సాధనలో కమిషనర్ రమణబాబు నాయకత్వం, సిబ్బంది సమిష్టి కృషి అభినందనీయమని స్వర్ణ వార్డు సిబ్బంది పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో గిద్దలూరును రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

## ఘనంగా జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు

### హాజరైన ఎన్జీవోల ఫోరం ప్రతినిధులు





**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 7**

జిల్లా యువజన సర్వీసుల శాఖ, స్టెప్ ఆధ్వర్యంలో బుధవారం మార్కాపురం జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. కేంద్ర యువజన సర్వీసుల శాఖకు అనుబంధంగా యువకులలో ఉన్న జానపద నృత్యం, సంగీతం, సాహిత్య ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాల్లో మార్కాపురంలోని వివిధ యువజన సంఘాలు పాల్గొన్నాయి. స్టెప్ వారి ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా ఎన్జీవోల ఫోరం కార్యదర్శి ఎన్జీవో మిత్రుడు నీలం లాజరు పాల్గొన్నారు.

## గంజా టెస్ట్ నిర్వహించిన పోలీసులు



**పొన్నలూరు పెన్ పవర్ అక్టోబర్ 7**

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం పొన్నలూరు పోలీస్ ఆధ్వర్యంలో గంజాయి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువతలు ప్రజలు దూరంగా ఉండాలని వాటి వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి సునీల్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిద్దలూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సెల్ ఫోన్ల చోరీ

### ఒకే బస్సులో ముగ్గురి సెల్‌ఫోన్లు అపహరణ..

### నిందితుల కోసం పోలీసుల దర్యాప్తు



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 07**

గిద్దలూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సెల్‌ఫోన్ చోరీల కలకలం రేపింది .గిద్దలూరు నుంచి ఒంగోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ముగ్గురు ప్రయాణికుల సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయి. ముగ్గురు ప్రయాణికులు తమ సెల్‌ఫోన్లు కనిపించకపోవడంతో వెంటనే అప్రమత్తమై బస్సు దిగి బస్టాండ్ ప్రాంతంలో పరిశీలించారు. అప్పటికే గుర్తుతెలియని నిందితులు అక్కడి నుంచి పరారైనట్లు బాధితులు తెలిపారు. మొత్తం మూడు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యారు. ఈ ఘటనపై బాధితులు వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినారు . బస్టాండ్‌లో నిఘా వ్యవస్థపై ఆరోపణలు విపిస్తున్నాయి. గిద్దలూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు తగినంతగా లేవని, రాత్రి వేళల్లో పలు ప్రాంతాల్లో లైటింగ్ సరిగా లేక చీకటిగా ఉంటోందని ప్రయాణికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సీసీ కెమెరాలను పెంచడంతో పాటు బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో రాత్రివేళల్లో పూర్తిస్థాయి లైటింగ్ ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# తౌశిక్,మౌలాబి మృతుల ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 7**

ప్రకాశం జిల్లాలోని సింగరాయకొండలోని శ్రీ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్‌లో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన సయ్యద్ తౌశిక్, ఆ బాలుడి తల్లి మౌలాబి మృతుల ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు.బాధ్యులను గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని,ఈ ఘటనపై నిష్పక్షపాతంగా సీబీఐ,సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం కొనసాగించేందుకు అన్ని ప్రజాసంఘాలు, దళిత, బహుజన, ముస్లిం, మైనార్టీ సంఘాలు, రాజకీయ పార్టీలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.తౌశిక్, మౌలాబి మృతుల ఘటనపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు అక్టోబరు 8న సాయంత్రం 3 గంటలకు యర్రగొండపాలెంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్,బాబూ జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు నాగరాజు మాదిగ తెలిపారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో సమావేశానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. ఘటనపై వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించి భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం



చేస్తారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ఉమ్మడి కార్యాచరణ రూపొందించడంతో పాటు, సమగ్ర విచారణ కోసం ప్రభుత్వంపై ప్రజాస్వామ్యబద్ధంగా ఒత్తిడి తీసుకురావడమే సమావేశం ప్రధాన లక్ష్యమని నాగరాజు మాదిగ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గర్నెపూడి వినయ్‌కుమార్ మాదిగ, మండల అధ్యక్షుడు దాస్ మాదిగ, ఎంఎస్ఎఫ్ మండల ఇన్‌చార్జి చేదూరి అశోక్ మాదిగ, ఎన్టీఆర్ జిల్లా ఎంఎస్‌పీ మాజీ అధ్యక్షుడు మంద పిచ్చయ్య మాదిగ, కాకినాడ ఇన్‌చార్జి చినబాబు మాదిగ, చిత్తూరు ఇన్‌చార్జి జనరాజుపల్లి కిషోర్ మాదిగ, గుంటూరు ఎంఆర్‌పీఎస్ మాజీ అధ్యక్షుడు వేమూరి సుధీర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఏబీఎం మిషనరీ ఆస్తులపై హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయండి

### అధికారుల నిర్లక్ష్య వైఖరిని వీడాలి -బాప్టిస్ట్ ఫీల్డ్ కమిటీ సభ్యులు జెడి లక్ష్మయ్య



**మార్కాపురం, పెన్ పవర్ అక్టోబర్ 7**

మార్కాపురం ఏబీఎం క్రిస్టియన్ స్థలాలను కొందరు వ్యక్తులు అక్రమంగా, అన్యాక్రాంతంగా దొంగ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, వాటిపై ఏబీఎం ఫీల్డ్ కమిటీ కోర్టును ఆశ్రయించగా హైకోర్టు క్రైస్తవులకు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చిందని బాప్టిస్ట్ ఫీల్డ్ కమిటీ సభ్యులు జెడి లక్ష్మయ్య అన్నారు.బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన మార్కాపురం ఏబీఎం ఆస్తులను ఎవరూ అమ్మడానికి, కొనడానికి వీలులేదని, అయినా పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమ పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిపారు. దీనిపై బాప్టిస్ట్ ఫీల్డ్ కమిటీ సభ్యులు అనేక విధాలుగా పోరాటం చేసి, న్యాయస్థానంలో దావా వేయడం జరిగిందని, అన్యాక్రాంతంగా చేసుకున్న రిజిస్ట్రేషన్లన్నీ చెల్లవని, పూర్తి సర్వహక్కులు ఏబీఎం ఆస్తులు క్రైస్తవులకే చెందుతాయని హైకోర్టు తీర్పు ఇచ్చిందని, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు.హైకోర్టు ఉత్తర్వులను సైతం అధికారులు పెడచెవిన పెట్టి, అన్యాక్రాంతమైన ఏబీఎం మిషనరీ ఆస్తులను క్రైస్తవులకు అప్పగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైతం క్రైస్తవుల ఆస్తులను క్రైస్తవులకే అప్పగించాలని ప్రకటించారని గుర్తు చేశారు. అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేసి, కోర్టుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగి న్యాయం కోసం మొరపెట్టుకుంటే హైకోర్టు తమ యందు కనికరించి న్యాయపరమైన తీర్పు ఇచ్చిందన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు జోక్యం చేసుకోవాలని, జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష మంది క్రైస్తవులు ఉన్నారని, వారి న్యాయమైన సమస్యను పరిష్కరించి, క్రైస్తవ మిషనరీ ఆస్తులను క్రైస్తవులకు అప్పగించాలని కోరారు.అధికారులు ఇదే తీరున న్యాయస్థాన ఉత్తర్వులను పెడచెవిన పెట్టి క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో క్రైస్తవులంతా ఏకతాటిపైకి వచ్చి ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి : సీపీఎం

### కంభం సెంటర్‌లో సీపీఎం భారీ బహిరంగ సభ -హాజరైన రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 7**

జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో బుధవారంమార్కాపురంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. అంతకుముందు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి కంభం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కంభం సెంటర్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు హాజరయ్యారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి. రమాదేవి ప్రసంగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మార్కాపురం జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, వెలిగొండ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని చెరువులను అభివృద్ధి చేసి సాగునీటి వసతి కల్పించాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాలని డిమాండ్ చేశారు. మార్కాపురం మెడికల్ కాలేజీని త్వరితగతిన పూర్తి చేసి పేదలకు వైద్యం అందుబాటులోకి తేవాలని, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కేంద్రానికి ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజా రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ




బహిరంగ సభకు సీపీఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. సభను సీపీఎం శ్రేణులు విజయవంతం చేశారు.

# మోడీ జన్మదిన వేడుకలలో సేవాస్ఫూర్తి

**మార్కాపురం, పెన్ పవర్ అక్టోబర్ 7**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దోర్నాల బస్టాండ్ సెంటర్ లో బీజేపీ ఆధ్వర్యంలో సేవా సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్ పై ఢిల్లీలో జరిగిన కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వీక్షించారు. ఈ సందర్భంగా పీవీ కృష్ణారావు మాట్లాడుతూ దేశ ప్రగతికి దృఢమైన దిశానిర్దేశంతో మోదీ ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం, దేశ ఆర్థిక ప్రగతి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మోదీ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా సేవకు ప్రతీకగా మలచాలనే సంకల్పంతో నెల రోజుల పాటు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహించేందుకు బీజేపీ శ్రేణులు కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం మాటలకే పరిమితం కాకుండా ప్రజల భాగస్వామ్యంతో కార్యరూపం దాల్చాలని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే నాటికి భారత్ ను





ప్రపంచ స్థాయిలో మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సేవా సంకల్ప జ్యోతి ర్యాలీ నిర్వహించారు. దోర్నాల బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని నాలుగు ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.?? ఈ కార్యక్రమంలో శాసనాల సరోజినీ, జిల్లా ఇన్చార్జి కే శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు మల్లెల గొన్స్, గుంటక సుబ్బారెడ్డి ,దేవిశెట్టి చంద్రశేఖర్ ,మండల శివప్రసాద్ ,టి అశోక్ రెడ్డి,దేశబోయిన శ్రీను, లక్ష్మి, అనిశెట్టి కొండలు, ఎం పుల్లయ్య, వెంకటేశ్వర్లు, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రాలపై తహసీల్దార్ ఆకస్మిక తనిఖీలు

**అధిక రుసుములు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు తప్పవు**

**తహసీల్దార్ కె. చిరంజీవి హెచ్చరిక**



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 7**

మార్కాపురం పట్టణంలోని ఆధార్ కేంద్రాలపై తహసీల్దార్ కె. చిరంజీవి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కంభం రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉన్న ఆధార్ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కామన్ మ్యాన్ గా వెళ్లి అక్కడ ఆధార్ సేవలకు వసూలు చేస్తున్న రుసుములపై స్వయంగా ఆరా తీశారు. అధిక రుసుములు చెల్లించిన లబ్ధిదారులతో మాట్లాడి, వారి స్టేట్ మెంట్లను అధికారులు నమోదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన రుసుములకే ఆధార్ సేవలు అందించాలని ఆదేశించారు. అధిక వసూళ్లు నిర్ధారణ అయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆధార్ సేవల్లో అధిక వసూళ్లకు పాల్పడవద్దని నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీల్లో డీటీ శ్రీనివాసులు, ఆర్ఐ అరుణ, వీఆర్వోలు వెంగల్ రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# మాజీ సీఎం జగన్‌ను కలిసిన దద్దాల

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 7**



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని నియోజకవర్గ వైయస్సార్సీపి సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ బుధవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు రానున్న మున్సిపల్ ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, బూత్ స్థాయి కమిటీల బలోపేతం, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై 30 నిముషాలకు పైగా సుదీర్ఘంగా చర్చించినట్లు దద్దాల తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీలో గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి జరిగిన మేలును ప్రజలకు వివరించాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారన్నారు. కనిగిరి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని ఎలాగైనా వైఎస్సార్సీపీ ఖాతాలో వేయాలని, అందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించినట్లు తెలిపారు జగనన్న ఆదేశాల మేరకు కనిగిరి మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు సంబందించి ఇప్పటికే కార్యకర్తల సమావేశాలు పూర్తి చేశామని, చైర్మన్ పీఠాన్ని వైఎస్సార్సీపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేసి వై.ఎస్.జగన్ కు హామీ ఇవ్వడం జరిగిందని దద్దాల నారాయణ యాదవ్ వెల్లడించారు. అదేవిదంగా 2024 పార్టీ ఓటమి తరువాత పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న మరియు కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు రాబోయే స్థానిక ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సూచించినట్లు తెలిపారు.

## పట్టణ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత : ఎమ్మెల్యే కందుల

**22వ వార్డు కమల హౌసింగ్ సొసైటీలో సీసీ రోడ్లకు శంకుస్థాపన**





**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 7**

పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మార్కాపురం పట్టణంలోని 22వ వార్డులోని కమల హౌసింగ్ సొసైటీలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.35 కోట్లతో పట్టణంలో సీసీ రోడ్లు వేయనున్నామని, వీటిని త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణంలో ప్రతి వార్డులో సీసీ రోడ్లు వేసి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. అంతేకాకుండా త్వరలోనే ఇంటింటికీ పైప్ లైన్ పథకాన్ని పూర్తి చేసి, శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు అందించే ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల లాంటివని, రెండింటి కలయికే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం నాయకులు, 22వ వార్డు తెలుగుదేశం నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వినియోగంపై గుడ్లూరు పోలీసులు ముమ్మర తనిఖీలు

**అనుమానిత వ్యక్తులకు డ్రగ్ స్క్రీనింగ్ పరీక్షలు**





**గుడ్లూరు, పెన్ పవర్, అక్టోబరు 07:**

గుడ్లూరు పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కందుకూరు డిఎస్పీ పర్యవేక్షణలో, గుడ్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ డీ.రమేష్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టే చర్యల్లో భాగంగా బుధవారం అనుమానిత వ్యక్తులకు డ్రగ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. డ్రగ్స్ వినియోగించినట్లయితే ప్రాథమికంగా పాజిటివ్ ఫలితం చూపించే డ్రగ్ డిటెక్షన్ కిట్ల సహాయంతో ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు హాజరైన వ్యక్తులందరికీ డ్రగ్ స్క్రీనింగ్ పరీక్షల్లో నెగెటివ్ ఫలితాలు వచ్చినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ మరియు సామాజిక నష్టాలపై అవగాహన కలిగి ఉండాలని గుడ్లూరు పోలీసులు యువకులకు సూచించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై పోలీసుల నిఘా మరియు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో డ్రగ్స్‌కు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని గుడ్లూరు పోలీసులు కోరారు.

# సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

## పొట్లూరులో పోషణ మాసోత్సవాలు

**గుడ్లూరు, పెన్ పవర్, అక్టోబరు 07**

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని సూపర్వైజర్ కామేశ్వరి అన్నారు. ఉలవపాడు ప్రాజెక్టు సిడిపిఓ మాధవిలత ఆదేశాలు మేరకు మండలంలోని తెట్టు సెక్టార్ లోని పొట్లూరు వన్ అంగన్వాడి సెంటర్లో 9వ పోషణ మహా మాస ఉత్సవాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గర్భవతులు బాలింతలు, కిషోరీ బాలికలు ఇతర తల్లులకు పౌష్టికాహారం పై అవగాహనను సూపర్వైజర్ కల్పించారు. మనం తీసుకునే ఆహారంలో పోషక విలువలు కలిగిన ఆకుకూరలు కాయగూరలు పండ్లు పాలు పాలు పదార్థాలు, చిరుధాన్యాలు, సజ్జలు జొన్నలు, రాగులు తీసుకోవాలని తెలియజేయడమైనదన్నారు. ఆకుకూరలు ఎక్కువగా వాడుకోవాలని ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని ప్రాంతీయ వంటకాల అవగాహన కల్పించడమైనదని ఆమె అన్నారు. ఆహారంలో వైవిధ్యం ఉండేటట్టుగా చూసుకోవాలని తెలియజేశారు. పోషణ మరియు బాల ప్రేరణ సమాజ స్వామి మరియు బాధ్యత అంగన్వాడీ సెంటర్లో



పిల్లలు తాజాగా భోజనం పై అవగాహన కల్పించారు. అలానే గర్భవతులకు బాలింతలకు ప్రధానమంత్రి మాతృ వందన యోజన పై అవగాహన కల్పించటమైనదన్నారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు ఎస్కే అమీర్, నిషా, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి గొట్టిపాటిని కలిసిన కొమ్మినేని వెంకట్రావు

**సి.ఎస్.పురం, పెన్ పవర్ అక్టోబర్ 7**



రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను మిట్టపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కొమ్మినేని వెంకట్రావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజలకు సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

# చిన్నారికట్లలో పోలీసుల కార్డన్ సెర్చ్





**కొనకనమిట్ల పెన్ పవర్ అక్టోబర్ 7**

కొనకనమిట్ల మండలం చిన్నారికట్ల గ్రామంలో సీ.ఐ రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి వాహనాల రికార్డులను పరిశీలించారు. 42 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలను తనిఖీ చేసి వాటి రికార్డులను పరిశీలించిన అనంతరం వాహనాలను సంబంధిత యజమానులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామస్థులకు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రాయింగ్‌లో ప్రతిభ కనబరిచిన సీతాన్ష్ కు అభినందనలు

**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 7:**

ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన 'సేవా సంకల్పం అభియాన్' పోటీలలో విజ్ఞాన్ విహార్ విద్యార్థి కె. సీతాన్ష్ ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా బుధవారం ఆ పాఠశాల కరస్పాండెంట్ జి హరిబాబు, డైరెక్టర్ అఖిల్ విద్యార్థిని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సీతాన్ష్ జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలో సీనియర్ విభాగంలో మూడవ స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. ఈ నెల 8, 9 వ తేదీలలో చినకాకానిలోని 'హైలాండ్' లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా తమ విద్యార్థి ప్రతిభ కనబరచి విజేతగా నిలవాలని వారు ఆకాంక్షించారు. అలాగే పాఠశాల సిబ్బంది కూడా సీతాన్ష్ కు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్

**ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలి -ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు**

**జరుగుమల్లి పెన్ పవర్, అక్టోబర్ 7**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ఈ నెల 9వ తేదీన జరుగుమల్లి మండలం నర్సింగోలు గ్రామ పరిధిలో వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ డైవర్షన్ ఏర్పాటు చేసినట్లు ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు తెలిపారు. జరుగుమల్లి వైపు నుంచి కామేపల్లి, కొండేపి, పొన్నలూరు వైపు వెళ్లే వాహనదారులు టంగుటూరు--ఉప్పలపాడు--వెన్నూరు మీదుగా కొండేపి వైపు వెళ్లాలని సూచించారు. అదేవిధంగా పొన్నలూరు, కొండేపి, పీరాపురం, ఎన్.ఎన్. కండ్రిక వైపు నుంచి జరుగుమల్లి వైపు వచ్చే వాహనదారులు కామేపల్లి జంక్షన్ నుంచి కొండేపి--వెన్నూరు--ఉప్పలపాడు--టంగుటూరు మీదుగా వెళ్లాలని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగానే ఈ డైవర్షన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు, వాహనదారులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించి పోలీసు శాఖకు సహకరించాలని డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు కోరారు.

## అయ్యలూరివారిపల్లిలో ఘనంగా నగర సంకీర్తన

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 7**

మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని బుధవారం మండల కమిటీ సభ్యులు, ధార్మిక సమితి సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు, భజనలతో గ్రామ పురవీధుల్లో నగర సంకీర్తన ర్యాలీ నిర్వహించారు. పలువురు గ్రామస్తులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు, ధార్మిక సమితి సభ్యులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో సమాజంలో ఐక్యత, సోదరభావం, మానవతా విలువలు పెంపొందుతాయని తెలిపారు. భక్తి, ధర్మం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు సనాతన ధర్మ పరిరక్షణ కోసం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములై సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు నేలపాటి రమణారెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపోల్స్ పై జగన్ సూపర్ స్పీడ్.. అందరికంటే ముందుగా అభ్యర్థుల ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి అన్న విషయం క్లారిటీ లేకపోయినా, ప్రతిపక్షం వైసీపీ దూకుడు చూపుతోంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము రెడీ అంటూ సంకేతాలు పంపుతోంది. ఇందులో భాగంగా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలోని ఇతర పార్టీలకన్నా ముందుగా అభ్యర్థుల ఖరారుపై దృష్టిపెట్టిందని అంటున్నారు. నెల్లూరు కార్పొరేషన్ నుంచి మేయర్ అభ్యర్థిగా ఆనం విజయ్ కుమార్ రెడ్డిని ఎంపిక చేస్తున్నట్లు వైసీపీ ప్రకటించింది. పార్టీ అధినేత జగన్ రెడ్డి నేతృత్వంలో వైసీపీ నేతలు సమావేశమయ్యారు. ఇందులో అనేక విషయాలపై చర్చించిన పార్టీ నేతలు అధికార కూటమిని దీటుగా ఎదుర్కొనేలా అభ్యర్థులు ఎంపిక ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నెల్లూరు నుంచి విజయ్ కుమార్ రెడ్డిని రంగంలోకి దింపుతున్నట్లు మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్దన్ రెడ్డి వెల్లడించారు.



**అధినేత సమీక్షలు**

రాష్ట్రంలో అక్టోబరు, నవంబరు నెలల్లో స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒకవైపు రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్న ప్రభుత్వం కోర్టు నిర్ణయం ఏవిధంగా ఉన్నా ఎన్నికల విషయంలో ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో ఈ నెలలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని మాజీ సీఎం జగన్మోహనరెడ్డి అంచనా వేస్తున్నారని అంటున్నారు. ఈ కారణంగా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ఆయన తాడేపల్లిలో వరుసగా జిల్లాల నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్థానికంగానే అభ్యర్థుల ఎంపిక చేసుకోవాలని స్వేచ్ఛ ఇచ్చిన అధినేత కొన్ని కీలక స్థానాల విషయంలో తానే స్వయంగా నిర్ణయం తీసుకుంటున్నారని అంటున్నారు.

**తొలి అభ్యర్థి ఆనం**

స్థానిక ఎన్నికల వాతావరణం క్రమంగా వేడెక్కుతున్న నేపథ్యంలో పార్టీలు అప్రమత్తమయ్యాయి. సరైన అభ్యర్థుల ఎంపికపై ఫోకస్ చేస్తున్నాయి. ఈ క్రమంలో వైసీపీ తొలి పేరు ప్రకటించింది. నెల్లూరు మేయర్ రేసులో ఆనం విజయ్ కుమార్ రెడ్డిని పోటీకి పెడుతున్నట్లు అధికారికంగా వెల్లడించింది. రిజర్వేషన్ ప్రక్రియపై స్పష్టత లేకపోయినా, అధికార పార్టీ నేతలు నెల్లూరు జనరల్ కేటగిరీలోకి వస్తుందన్న అంచనాతో అప్పుడే ప్రచారం చేసుకుంటున్నారని, తాము వెనకబడకూడదనే ఆలోచనతో మేయర్ అభ్యర్థిని ప్రకటిస్తున్నట్లు మాజీ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో ఇతర పార్టీలు ఏవీ ఇంతవరకు అభ్యర్థుల ఎంపికపై నిర్ణయం వెలువరించలేదు. కానీ, వైసీపీ మాత్రం అధికారికంగానే నిర్ణయం తీసుకోవడంతో మున్సిపోల్స్ కు ముందుగా దూసుకువచ్చినట్లు చెబుతున్నారు.

**కంగూరు పెడుతున్న కూటమి**

స్థానిక ఎన్నికల విషయంలో కూటమి రాజకీయాలు విపక్షాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో ఆ పార్టీ ఎన్నికల విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని చెబుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కాకపోయినప్పటికీ నెల్లూరు మేయర్ అభ్యర్థిని వైసీపీ ప్రకటించడం చూస్తుంటే, ఎన్నికలను ఆ పార్టీ ఎంత సీరియస్ గా తీసుకుందో అర్థమవుతోందని అంటున్నారు. అధికార పార్టీ ఇంతవరకు ఎవరినీ అభ్యర్థిగా ప్రకటించకపోయినా, స్థానిక నేతలు అంతా ఓ నిర్ణయం తీసుకుని ఓ నాయకుడిని మేయర్ అభ్యర్థిగా ప్రచారం చేసుకోమని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అంటున్నారు. దీంతో ఆయన నెల్లూరులో అందరినీ కలుస్తూ, మద్దతు కూడగట్టుకుంటున్నారని చెబుతున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న వైసీపీ కూడా మేయర్ అభ్యర్థిని ముందుగా ప్రకటించాలని నిర్ణయం తీసుకుని వెనువెంటనే అమలు చేసినట్లుగా చెబుతున్నారు.

**ఆనం ఎందుకు?**

నెల్లూరు మేయర్ అభ్యర్థిగా ఆనం విజయ్ కుమార్ రెడ్డి పేరు ప్రకటన రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నెల్లూరు నగరంలో ఆనం కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉండటంతో ఆ కుటుంబంలో ఒకరికి అవకాశం ఇవ్వాలని వైసీపీ నిర్ణయం తీసుకున్నట్లుగా చెబుతున్నారు. ఇదే సమయంలో కూటమిలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఇరుకన పెట్టేలా వ్యూహాత్మకంగా అడుగులు వేసిందని అంటున్నారు. నెల్లూరు కార్పొరేషన్ గా ఆవిర్భవించడానికి ముందు మున్సిపాలిటీగా ఉన్న సమయంలో ఆనం కుటుంబానికి చెందిన వివేకానందరెడ్డి సుదీర్ఘకాలం చైర్మనుగా పనిచేశారు. ఆ తర్వాత ఆయన ఎమ్మెల్యే అయ్యారు. ఈ కారణంగా నగరంలో ఆనం కుటుంబానికి ఉన్న ఆదరణను క్యాష్ చేసుకోవాలని వైసీపీ వ్యూహాత్మక నిర్ణయం తీసుకుందని అంటున్నారు. ఇదే సమయంలో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందనే సంకేతాలు పంపడానికి ఆనం ఎంపిక నిదర్శనంగా చూపొచ్చునని అంటున్నారు.

# విజయసాయి గ్రౌండ్ వర్క్ సీరియస్ గానే ఉందే

**తిరుపతి, అక్టోబరు 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు సిద్ధమవుతున్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మరో కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకు ప్రజల ఎజెండాగా 15 అంశాలను ప్రకటించానని, ఈ నెల 8న తిరుపతిలో నిర్వహించనున్న తన నాలుగో ప్రెస్‌మీట్‌లో మరో ఐదు ప్రతిపాదనలను ప్రజల ముందుంచనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.కలియుగ దైవమైన తిరుమలేశ్వరుడి సన్నిధిలోని తిరుపతిని ఈ సమావేశానికి వేదికగా ఎంచుకున్నట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. రాయలసీమ ఎదుర్కొంటున్న కరువు, ఎల్‌నినో ప్రభావం, ఉపాధి అవకాశాల కొరతతో జరుగుతున్న వలసలు వంటి అంశాలపై సమావేశంలో మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు.అదే సమయంలో రాష్ట్ర రాజకీయాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్న రెండు కుటుంబాలపై కూడా తన విమర్శలను కొనసాగించనున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. రాయలసీమ అభివృద్ధి, ప్రాంతీయ సమస్యలు, రాష్ట్ర రాజకీయాల్లో కుటుంబాల ప్రభావం వంటి అంశాలను ప్రస్తావించనున్నట్లు తెలిపారు. గతంలోనూ రాయలసీమకు సాగునీటి ప్రాజెక్టులు, ఉపాధి, యువతకు అవకాశాలపై ఆయన పలు వ్యాఖ్యలు చేశారు.మన సంస్కృతి, భారతీయతపై జరుగుతున్న దాడుల అంశాన్ని కూడా తిరుపతి సమావేశంలో ప్రస్తావిస్తానని విజయసాయిరెడ్డి చెప్పారు. రాష్ట్రంలోనే ఒక వర్గం మైనార్టీగా మారిపోయే పరిస్థితి రాకుండా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, దీనికి సంబంధించి మరో ఐదు ప్రతిపాదనలను ప్రజల ముందు ఉంచుతానన్నారు. అయితే ఆ ఐదు ప్రతిపాదనలు ఏమిటన్నది ఆయన ఇంకా వెల్లడించలేదు.విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రక్రియను ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. విజయదశమి తర్వాత పార్టీని ప్రారంభించే దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని గతంలో వెల్లడించారు. పార్టీ విధానాల్లో ప్రజల ఆదాయాన్ని పెంచడం, నిత్యావసరాల ధరలను తగ్గించడం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, విద్యుత్–విద్య–ఉద్యోగాలకు ప్రాధాన్యం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. యువతకు రాజకీయాల్లో పెద్దపీట వేస్తామని కూడా ప్రకటించారు.ఇప్పటివరకు విజయసాయిరెడ్డి విజయవాడ, అనంతపురం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో తన రాజకీయ కార్యాచరణకు సంబంధించిన అంశాలను వెల్లడించారు. రాయలసీమ తర్వాత ఉత్తరాంధ్రకు కూడా ప్రాంతీయ అభివృద్ధి, నీటి సమస్యలు, వలసలు, పరిశ్రమలు వంటి అంశాలపై ఆయన ప్రత్యేక ప్రతిపాదనలు వెల్లడించారు.ఈ నేపథ్యంలో తిరుపతిలో జరగనున్న నాలుగో ప్రెస్‌మీట్‌లో విజయసాయిరెడ్డి ప్రకటించబోయే ఐదు కొత్త ప్రతిపాదనలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. సమాజం కోసం ఆలోచించే మీడియా ప్రతినిధులు సమావేశానికి హాజరై తన ప్రతిపాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.=



# టీడీపీ కార్యకర్తల కోసం పదవులు రిజర్వు.. 150 మందికి లోకేశ్ బంపర్ ఆఫర్

**తిరుపతి, అక్టోబరు 7, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీపై తనదైన ముద్రవేసేలా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కడప మహానాడులో కార్యకర్తే అధినేత అంటూ పిలుపునిచ్చిన లోకేశ్ ఇప్పుడు ఆ నినాదాన్ని నిజం చేసేలా అడుగులు వేస్తున్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న పార్టీ కోసం పనిచేసిన నాయకులను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా, వారి కోసం నామినేటెడ్ పదవులను రిజర్వు చేయాలని నిర్ణయించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి ఆయన అనుమతి కూడా తీసుకున్నారని అంటున్నారు. దీంతో టీడీపీలో క్షేత్రస్థాయిలో పనిచేసిన సుమారు 150 మందికి త్వరలో నామినేటెడ్ పోస్టులు దక్కనున్నాయని అంటున్నారు.తెలుగుదేశం పార్టీలో తన ఆరంగేట్రం నుంచి నారా లోకేశ్ తనదైన ముద్ర కోసం ప్రయత్నిస్తున్నారు. తొలిసారిగా కార్యకర్తల సంక్షేమ నిధికి రూపకల్పన చేసి కార్యకర్తల మనసులను గెలుచుకున్నారు. ఆపద సమయంలో అపన్నహస్తం అందించేలా టీడీపీ సభ్యత్వం ఉన్నవారికి బీమా చేయించారు. ఆ తర్వాత కార్యకర్తల కోసం తాను ఉన్నానంటూ పలు కార్యక్రమాలను లోకేశ్ తీసుకువచ్చారు. ప్రధానంగా సోషల్ మీడియా ద్వారా కార్యకర్తలకు అందుబాటులో ఉండటమే కాకుండా, టీడీపీ కోసం పనిచేసి ప్రాణాలు కోల్పోయిన తోట చంద్రయ్య వంటివారి కుటుంబ సభ్యులకు వెన్నుదన్నుగా నిలిచారని చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు నామినేటెడ్ పోస్టుల్లోనూ కార్యకర్తలకు అగ్ర తాంబూళం దక్కాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు.



ఇక మంత్రి లోకేశ్ తీసుకున్న నిర్ణయంతో టీడీపీలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న 150 మందికి త్వరలో పదవులు దక్కే అవకాశం ఉందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 సెప్టెంబరులో తొలివిడతలో 20 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించారు. వీరి పదవీ కాలం ఈ నెలతో ముగియనుందని అంటున్నారు. పార్టీలో అందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలనే ఆలోచనతో ప్రస్తుతం పదవుల్లో ఉన్న చాలా మందికి రెన్యువల్ చేసే అవకాశం లేదని అంటున్నారు. వీరిస్థానంలో గత ప్రభుత్వంపై ధైర్యసాహసాలతో పోరాడి తెగువ చూపిన కార్యకర్తలకు పెద్దపీట వేయాలని వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు.2024లో రెండు విడతలు సుమారు 148 పదవులను భర్తీ చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పదవులు అన్నింటిని ఇప్పుడు కొత్తవారికి ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. అయితే సహజంగా పదవుల కోసం ఏ పార్టీలో అయినా పైరవీలు ఉంటాయి. ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సుతోనే పదవులు కట్టబెట్టే సంస్కృతి ఇప్పటివరకు ఉందని పరిశీలకులు చెబుతున్నారు. టీడీపీ కూడా ఇప్పటివరకు ఇదే విధానాన్ని అవలంబించిందని అంటున్నారు. అయితే నారా లోకేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక ఈ విధానాన్ని సంస్కరించాలని నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. సిఫార్సులు లేకుండా వచ్చే నెలతో ఖాళీ అయ్యే పదవులు అన్నింటిని భర్తీ చేస్తామని మంత్రి లోకేశ్ బహిరంగంగా ప్రకటించారు.పనితీరే ఆధారంగా కార్యకర్తల ఎంపిక ఉంటుందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన కార్యకర్తలను గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెబుతున్నారు. గతంలో చేపట్టిన 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంతోపాటు పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేసిన వారు, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సుపరిపాలనకు తొలి అడుగు, రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాల్లో బాగా పనిచేసిన వారిని గుర్తించనున్నట్లు చెబుతున్నారు. మొత్తం ఆరు అంశాలను పరిశీలించి కనీసం ఐదింటిలో మెరుగైన ఫలితాలు సాధించేలా పనిచేసిన వారికి పదవులు కట్టబెట్టాలని నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. దీంతో మంత్రి లోకేశ్ నిర్ణయం పార్టీ వర్గాల్లో విస్తృత చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు.

# ఉత్తరాంధ్రలో వైసీపీ గ్రాఫ్ ఏమౌతోంది

**విశాఖపట్టణం, అక్టోబరు 7, పెన్ పవర్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత బలమైన కోటగా నిలిచిన ఉత్తరాంధ్ర లో ప్రస్తుతం ఆ పార్టీ పరిస్థితి ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. 2024 ఎన్నికల ఓటమి తర్వాత కుదురుకుంటుందని భావించినప్పటికీ, కీలక నేతల వరుస రాజీనామాలు, సస్పెన్షన్లతో పార్టీ గ్రాఫ్ పడిపోయింది. విజయనగరం జిల్లాలో పార్టీకి వెన్నెముకగా ఉన్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్సీపీకి రాజీనామా చేయడంతో బొత్స సత్యనారాయణ ప్రాబల్యంపైనే పెద్ద ప్రశ్నమార్క్ పడింది. దానికి తోడు బద్దుకొండ అప్పలనాయుడు సస్పెన్షన్, సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే దువ్వాడ శ్రీను పార్టీకి దూరం కావడంలాంటి కారణాలతో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పార్టీ కొంత చేటు తెచ్చింది. ఇక .విశాఖపట్నం రాజకీయాలను పరిశీలిస్తే, ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ సహా పలువురు కీలక నేతలు వైఎస్సార్సీపీకి వీడ్కోలు పలికారు. మిగిలిన కొద్దిమంది సీనియర్ నాయకులు సైతం వైఎస్సార్సీపీ కార్యకలాపాలకు దూరంగా ఉండిపోయారు. పార్టీ వీడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటమే కాకుండా, నూతనంగా పార్టీలో చేరేందుకు ఏ ఒక్క ద్వితీయ శ్రేణి నాయకుడు కూడా ఉత్సాహం చూపడంలేదు. అధిష్టానం ఎంత ఒత్తిడి తెచ్చినా క్షేత్రస్థాయిలో కేడర్ను సమాయత్తం చేసే నాయకులు కరువయ్యారు. శ్రీకాకుళం నుంచి విజయనగరం వరకు పార్టీని నడిపించాల్సిన సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ప్రభావం కూడా ఇప్పుడు నామమాత్రంగానే మారిపోయింది. తన స్వంత మేనల్లుడైన మజ్జి శ్రీనివాసరావును కూడా పార్టీలో నిలుపుకోలేకపోయారనే విమర్శలు వైఎస్సార్సీపీ వర్గాల నుంచే వస్తున్నాయి. రీజినల్ కోఆర్డినేటర్లు, ఇన్చార్జులు వచ్చి సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ, అవి కేవలం ప్రెస్ మీట్లకే పరిమితమవుతున్నాయి.

ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత ప్రజల్లో ఉన్న ఆ వ్యతిరేకతను అధిగమించేందుకు వైఎస్సార్సీపీ రీ–బిల్డింగ్ ప్లాన్స్ ఏవీ ఉత్తరాంధ్రలో పనిచేయడం లేదు. ఓటమి నిరాశ నుంచి బయటపడకముందే వరుస వికెట్లు పడిపోతుండటంతో పార్టీ క్యాడర్ అయోమయంలో వుంది. సరైన నాయకత్వం, స్పష్టమైన వ్యూహం, క్షేత్రస్థాయి పోరాటాలు లేకపోతే.. ఒకప్పుడు తన సొంత కోటగా భావించిన ఉత్తరాంధ్రలోనే వైఎస్సార్సీపీ ఉనికి ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

# అసెంబ్లీ ఫార్ములా రగడ...

**ఒంగోలు అక్టోబరు 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ఇప్పుడు మరో కీలక రాజకీయ పరీక్షను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి సాధించిన విజయాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పునరావృతం చేయాలన్న లక్ష్యంతో కూటమి నాయకత్వం వ్యూహరచనకు పదును పెడుతోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మధ్య జరిగిన సుదీర్ఘ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.అమరావతిలో దాదాపు రెండు గంటల పాటు జరిగిన భేటీలో స్థానిక ఎన్నికల్లో కూటమి ఎదుర్కొనే ప్రధాన సవాళ్లపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఈ సమావేశం కేవలం సీట్ల పంపకాలపై చర్చకే పరిమితం కాలేదన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు టీడీపీ––జనసేన మధ్య సమన్వయం ఎలా ఉండాలి? ఏ పార్టీకి ఏ ప్రాంతంలో బలం ఉంది? మిత్రపక్షాల మధ్య పోటీ కారణంగా ఓట్లు చీలకుండా ఎలా చూడాలి? అనే అంశాలే అసలు ఎజెండాగా కనిపిస్తున్నాయి.సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి ప్రధాన కారణాల్లో టీడీపీ, జనసేన మధ్య సమన్వయం ఒకటి. ఇప్పుడు అదే ఫార్ములాను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అమలు చేయాలని నాయకత్వం భావిస్తోంది. అయితే స్థానిక ఎన్నికల స్వభావం అసెంబ్లీ ఎన్నికల కంటే భిన్నం. ఇక్కడ అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, స్థానిక వర్గ సమీకరణాలు, కుటుంబ రాజకీయాలు, గ్రామస్థాయి సంబంధాలు, స్థానిక నాయకుల మధ్య పోటీ వంటి అంశాలు కీలకంగా మారతాయి. అందుకే రాష్ట్రస్థాయిలో కుదిరే అవగాహనను క్షేత్రస్థాయిలో అమలు చేయడం కూటమి నాయకత్వానికి అసలు సవాలుగా మారనుంది.ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన మధ్య ప్రత్యేక సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం కీలకంగా మారింది. ఏ ప్రాంతంలో ఏ పార్టీకి బలమైన కేడర్, సామాజిక ఆధారం, స్థానిక నాయకత్వం ఉందో అంచనా వేసి, అక్కడ ఆ పార్టీకి ప్రాధాన్యం ఇచ్చే విధానం తెరపైకి వస్తోంది.ఇది కేవలం సీట్ల సర్దుబాటు కాకుండా.. కూటమి ఓటు బ్యాంకును సమర్థంగా వినియోగించుకునే ప్రయత్నంగా చూడొచ్చు. ఒకే ప్రాంతంలో మిత్రపక్షాలు పరస్పరం పోటీ పడితే అధికార వ్యతిరేక ఓటుతో పాటు కూటమి ఓటు కూడా చీలిపోయే అవకాశం ఉంటుంది. ఈ ప్రమాదాన్ని ముందుగానే అడ్డుకోవడమే సమన్వయ కమిటీ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.పవన్ కళ్యాణ్‌తో సమావేశం అనంతరం చంద్రబాబు టీడీపీ ముఖ్య నేతలతో ప్రత్యేకంగా భేటీ కావడం కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానిక ఎన్నికల విషయంలో పార్టీ అంతర్గతంగా ఎలాంటి అసంతృప్తి తలెత్తకుండా చూడాలని చంద్రబాబు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, ఆశావహులు అసంతృప్తికి గురైతే దాని ప్రభావం నేరుగా క్షేత్రస్థాయిలో పడే అవకాశం ఉంది. అందుకే వ్యక్తిగత ప్రయోజనాల కంటే కూటమి ప్రయోజనాలే ముఖ్యమని టీడీపీ నాయకత్వం స్పష్టం చేస్తోంది.స్థానిక సంస్థల ఎన్నికలు కూటమికి కేవలం మరో ఎన్నిక కాదు. అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ––జనసేన భాగస్వామ్యం క్షేత్రస్థాయిలో ఎంతవరకు బలపడిందో తేల్చే పరీక్ష కూడా. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కనిపించిన ఐక్యతను గ్రామస్థాయి రాజకీయాల్లో కొనసాగించగలిగితే కూటమి మరింత బలపడే అవకాశం ఉంటుంది.అయితే స్థానిక ఎన్నికల్లో వ్యక్తిగత ఆశలు, స్థానిక ఆధిపత్య పోటీలు, టికెట్ల కోసం పోటీ పెరగడం సహజం. ఈ విభేదాలను ఎంత సమర్థంగా పరిష్కరిస్తారన్నదే కూటమి విజయానికి కీలకంగా మారనుంది.మొత్తంగా చంద్రబాబు––పవన్ భేటీని చూస్తే.. స్థానిక ఎన్నికల్లో ఎవరు ఎన్ని స్థానాలు గెలుస్తారనే దానికంటే ముందుగా కూటమి భాగస్వామ్య పక్షాలు ఒకరినొకరు ఎంతవరకు సమన్వయం చేసుకుంటాయన్నదే అసలు రాజకీయ కథగా మారుతోంది. గ్రామస్థాయిలో ఈ సమన్వయం సక్సెస్ అయితే స్థానిక ఎన్నికల ఫలితాలు కూటమికి మరో పెద్ద రాజకీయ బలంగా మారే అవకాశం ఉంది.

# గాడిన పడుతున్న ఆర్థిక వ్యవస్థ

**విజయవాడ, అక్టోబరు 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుడ్ న్యూస్. ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్న ఆ రాష్ట్రం ఇప్పుడు గాడిలో పడుతుంది. చంద్రబాబు దార్శనీయకమైన పరిపాలన ఆ రాష్ట్రానికి ఆయువు పట్టు లాగా మారింది. ఆయన నాయకత్వంలో ఏపీ రాష్ట్రం అనేక రంగాలలో అభివృద్ధి సాధిస్తోంది. ఇప్పుడు ఏకంగా జాతీయ సగటును మించిపోయింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖజానాకు జీఎస్టీ వసూళ్లు ఊరట కలిగించే విధంగా ఉన్నాయి. రాష్ట్రంలో పన్ను ఆదాయం పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక కార్యకలాపాలలో కదలిక కొనసాగుతోంది. ముఖ్యంగా 2026 సెప్టెంబర్ లో ఏపీ నెట్ జీఎస్టీ వసూళ్లు జాతీయ వృద్ధి సగటును మించిపోయాయి. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేస్తోంది.2026 సెప్టెంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ నెట్ జీఎస్టీ వసూళ్లు 3,182.87 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది వసూళ్లు సెప్టెంబర్ నెలలో 2,789.50 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే వసూళ్ల వృద్ధి 14.1 సున్న శాతంగా నమోదయింది. ఇక ఇదే సమయంలో జాతీయస్థాయిలో పోస్ట్ సెటిల్మెంట్ నెట్ జీఎస్టీ వృద్ధి రేటు సాగటు 8 శాతం గా ఉంది. అంటే జాతీయ సగటుతో పోల్చి చూస్తే ఏ అభివృద్ధి గణనీయంగా నమోదయింది.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు పరిశీలిస్తే రాష్ట్ర నెట్ జీఎస్టీ వసూళ్లు 19,635.49 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే కాలంలో 16,760.21 కోట్లుగా వసూళ్ళు ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే ఏకంగా 18% వృద్ధి నమోదయింది. మొత్తం కమర్షియల్ ట్యాక్స్ వసూళ్లు కూడా సెప్టెంబర్ నాటికి 30,435.98 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 25,892.92 కోట్లుగా ఉన్నది. గత ఏడాదితో పోల్చి చూస్తే వృద్ధిరేటు ఏకంగా 18% అధికంగా నమోదయింది.ఈ పెరుగుదలకు పన్ను చెల్లింపుల్లో మెరుగైన అనుసరణ.. కట్టుదిట్టమైన తనిఖీ.. రెవెన్యూ మానిటరింగ్.. ఆర్థిక కార్యకలాపాల విస్తరణ వంటివి కారణాలని అధికారులు చెబుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డేటా అనలటిక్స్.. యూపీఐ లావాదేవీల విశ్లేషణ.. ఐ జీఎస్టీ రివర్సల్స్ డిస్కం ఆదారిత రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్ వంటి చర్యలను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయడంతో ఆదాయం పెరిగిపోయింది.ప్రభుత్వ చర్యలు మాత్రమే కాకుండా.. వినియోగం.. వ్యాపార కార్యకలాపాలు.. పన్ను అనుసరణ వంటి అనేక అంశాలు కూడా జీఎస్టీ వసూళ్లకు దోహదం చేశాయని వాణిజ్య శాఖ అధికారులు చెబుతున్నారు. జాతీయస్థాయిలో సెప్టెంబర్ 2026 లో మొత్తం స్థూల జీఎస్టీ వసూళ్లు కూడా 14.7% పెరిగాయి. మొత్తంగా 2.3 లక్షల కోట్లకు చేరుకున్నాయి. మొత్తంగా చూస్తే జీఎస్టీ వసూళ్లలో ఏపీ నమోదు చేస్తున్న అభివృద్ధి రాష్ట్ర ప్రజలకు కొంత ఆర్థిక వెసులుబాటు కల్పించే పరిణామం లాగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఇదే ధోరణి కొనసాగితే ఏపీ రాష్ట్రం ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధిస్తుంది. సమర్థవంతమైన నాయకత్వం.. ఆర్థిక అంశాలలో పొదుపు వల్ల ఈ స్థాయిలో వసూళ్లు సాధ్యమయ్యాయి. కాగా, ఏపీ ఖజానా ఇలా కావడం.. జగన్ కు మింగుడుపడని వార్త అని టీడీపీ నాయకులు అంటున్నారు.

# 2027 వరల్డ్‌కప్ తర్వాత కోహ్లీ రిటైర్ అవ్వడా? ఇంగ్లండ్ మాజీ స్టార్ సంచలన కామెంట్స్

- 2027 వన్డే వరల్డ్‌కప్ తనకు చివరిదని ఇప్పటికే ప్రకటించిన కోహ్లీ
- అయితే ఆ టోర్నీ తర్వాత కూడా కోహ్లీ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పకపోవచ్చన్న పనేసర్
- విరాట్‌లో ఇప్పటికీ పరుగులు చేయాలనే ఆకలి చాలా ఉందని వ్యాఖ్య
- అందుకే వరల్డ్‌కప్ తర్వాత అతడు రిటైర్ అవుతాడని తనకు అనిపించడం లేదన్న పనేసర్
- రోహిత్ క్రీజులో కుదురుకుంటే విధ్వంసకరంగా బ్యాటింగ్ చేయగలడని ప్రశంస



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే వరల్డ్‌కప్ తనకు చివరిదని కోహ్లీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ టోర్నీ తర్వాత కూడా కోహ్లీ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పకపోవచ్చని పనేసర్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల వన్డేల్లో కోహ్లీ 15 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఈ సందర్భంగా కోహ్లీ ఆటపై పనేసర్ ప్రశంసలు కురిపించాడు. అతడిలో ఆటపై ఆకలి, దూకుడు, ఫిట్‌నెస్‌పై శ్రద్ధ తనను ఆకట్టుకుంటున్నాయని చెప్పాడు. కోహ్లీ శిక్షణ చూస్తే తాను కూడా జిమ్‌కు వెళ్లాలనిపిస్తుందని పేర్కొన్నాడు. "విరాట్‌లో ఇప్పటికీ పరుగులు చేయాలనే ఆకలి చాలా ఉంది. ప్రతి మ్యాచ్‌ను ఎంతో తీవ్రతతో ఆడతాడు. ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తాడు. చుట్టూ ఉన్న వారిని కూడా ప్రోత్సహిస్తాడు. 10-15 మ్యాచ్‌లే మిగిలి ఉన్నాయని భావిస్తే ప్రతి మ్యాచ్‌ను ప్రత్యేకంగా చూస్తాం. కోహ్లీ కూడా ప్రస్తుతం అదే మైండ్‌సెట్‌తో ఆడుతున్నాడు. ప్రతి బంతికి తన వంద శాతం ఇస్తున్నాడు. అందుకే వరల్డ్‌కప్ తర్వాత అతడు రిటైర్ అవుతాడని నాకు అనిపించడం లేదు. అతడి నుంచి ఇంకా చాలా క్రికెట్ చూడొచ్చు" అని పనేసర్ చెప్పాడు.

మరోవైపు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మపైనా పనేసర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ గొప్ప ఆటగాడని, అతడికి ప్రపంచకప్ జట్టులో అవకాశం ఇవ్వాలని అన్నాడు. రోహిత్ క్రీజులో కుదురుకుంటే విధ్వంసకరంగా బ్యాటింగ్ చేయగలడని పేర్కొన్నాడు. "రోహిత్ అద్భుతమైన ఆటగాడు. అతడు ఫామ్‌లోకి వస్తే బ్యాటింగ్‌తో ప్రత్యర్థులను చిత్తు చేయగలడు. భారత్‌కు అతడి లాంటి నాణ్యమైన ఆటగాడు అవసరం" అని పనేసర్ చెప్పాడు.

# ఐసీసీ ర్యాంకింగ్స్: శ్రేయస్‌కు కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంక్.. టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు

- వెస్టిండీస్‌పై సెంచరీతో టీ20 ర్యాంకింగ్స్‌లో 7వ స్థానానికి శ్రేయస్
- టీ20 టాప్-10లో ఇషాన్, అభిషేక్, శ్రేయస్, తిలక్ వర్మ
- డబుల్ సెంచరీతో వన్డేల్లో అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్న శుభ్‌మన్ గిల్
- వన్డే బ్యాటింగ్ టాప్-10లోకి తిరిగి ప్రవేశించిన కేఎల్ రాహుల్



ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళు సత్తా చాటారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకోగా, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో అద్భుత శతకం సాధించిన శ్రేయస్ అయ్యర్, టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 7వ స్థానంలో నిలిచాడు.

నిన్న జరిగిన ఆ మ్యాచ్‌లో శ్రేయస్ కేవలం 43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేసి జట్టుకు 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందించాడు. ఈ ప్రదర్శనతో అతను టీ20ల్లో భారత్ తరపున మూడో అత్యుత్తమ ర్యాంకు బ్యాటర్‌గా నిలిచాడు. తాజా ర్యాంకింగ్స్‌లో ఇషాన్ కిషన్ (1), అభిషేక్ శర్మ (2) తొలి రెండు స్థానాల్లో ఉండగా.. తిలక్ వర్మ 10వ స్థానంలో ఉన్నాడు. దీంతో టీ20 బ్యాటింగ్ టాప్-10లో నలుగురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం.

### అగ్రస్థానంలో గిల్ పదిలం

మరోవైపు వన్డే ఫార్మాట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో గువాహటిలో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసిన గిల్, తన కెరీర్‌లోనే అత్యధికంగా 841 రేటింగ్ పాయింట్లను అందుకున్నాడు. విజయవంతమైన వన్డే ఛేదనలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం గమనార్హం. ఇదే జాబితాలో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి మూడో ర్యాంకుకు పడిపోయాడు. అదే సిరీస్‌లో అజేయ శతకం (129) బాదిన వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ తిరిగి టాప్-10లోకి ప్రవేశించాడు.

### మళ్లీ నం.01 స్థానానికి రషీద్ ఖాన్

బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్థాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్‌ను వెనక్కి నెట్టి రషీద్ 8వ సారి నంబర్ 1 ర్యాంకును అందుకున్నాడు. టీ20 చరిత్రలో మరే బౌలర్ కన్నా ఎక్కువ కాలం నం.01గా నిలిచిన బౌలర్‌గా రషీద్ రికార్డు సృష్టించాడు. భారత స్పిన్ ఆల్-రౌండర్ అక్షర్ పటేల్ గత మూడు మ్యాచ్‌ల్లో నిలకడగా రాణించి 16 స్థానాలు మెరుగుపరచుకుని 7వ ర్యాంకుకు చేరుకున్నాడు.

ఇతర ఆటగాళ్లలో వెస్టిండీస్ వన్డే కెప్టెన్ షాయ్ హోప్ (6వ ర్యాంక్), విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడెన్ సీల్స్ (10వ ర్యాంక్) వన్డేల్లో టాప్-10లోకి వచ్చారు. వెస్టిండీస్‌కే చెందిన అమీర్ జంగూ 55 స్థానాలు ఎగబాకి 55వ ర్యాంకు సాధించాడు. ఆసియా క్రీడల్లో రాణించిన పాకిస్థాన్ ఆటగాడు హసన్ నవాజ్ 62 స్థానాలు మెరుగుపరుచుకుని 48వ ర్యాంకులో నిలిచాడు.

# 2036 ఒలింపిక్స్‌పై భారత్ మాస్టర్ ప్లాన్.. అహ్మదాబాద్ నుంచి బిడ్ ప్రక్రియ షురూ!

2036 సంవత్సరంలో జరిగే ఒలింపిక్స్, పారాలింపిక్స్ క్రీడల ఆతిథ్య వేదికను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా.. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (Xూజ) ప్రకటించిన నగరాలు, దేశాల జాబితాను ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (Xూూ) సాదరంగా స్వాగతించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ (ూఎఝుఝుఽ) కేంద్రంగా భారత్ తన ఒలింపిక్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తోంది. గత 18 నెలలుగా ఐఓసీతో జరిపిన నిరంతర సంప్రదింపుల ద్వారా ఈ ప్రణాళిక రూపుదిద్దుకుంది.

### రైజింగ్ టు గెదర్ నినాదంతో ముందుకు..

భారతదేశం ఎంచుకున్న రైజింగ్ టుగెదర్ దృక్పథం.. క్రీడల ద్వారా దేశం రూపాంతరం చెందడం, ఒలింపిక్ ఉద్యమ భవిష్యత్తు కలిసికట్టుగా కొనసాగాలనే నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడం కేవలం ఒక గ్లోబల్ ఈవెంట్‌ను నిర్వహించడమే కాకుండా, క్రీడలను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయడానికి ఒక చారిత్రక అవకాశం. కోట్లాది మంది యువతను కేవలం క్రీడలను వీక్షించే స్థాయి నుంచి వాటిని ఆచరించే స్థాయికి తీసుకెళ్లడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం.

### ఒలింపిక్ ఉద్యమానికి నూతన శకం

ప్రపంచంలోనే అత్యంత యువ జనాభా, అత్యుత్తమ డిజిటల్ నెట్‌వర్క్ కలిగిన భారత్‌కు ఒలింపిక్స్ ఆతిథ్యం దక్కితే అది ఒలింపిక్ ఉద్యమానికి ఒక కొత్త శకం అవుతుందని ఐఓసీ భావిస్తోంది. వంద కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలోకి ఒలింపిక్స్ ప్రవేశించడం వల్ల కొత్త అథ్లెట్లు, కొత్త ప్రేక్షకులు, కొత్త భాగస్వాములు ఒలింపిక్ కుటుంబానికి లభిస్తారు. భారతదేశం యొక్క సాంస్కృతిక వైవిధ్యాన్ని ఈ వేడుక ప్రపంచానికి చాటిచెప్పనుంది.

### పీటీ ఉష, మన్సుఖ్ మాండవ్య హర్షం:

ఐఓఏ అధ్యక్షుడు పీటీ ఉష మాట్లాడుతూ.. 2036 ఒలింపిక్స్ కోసం భారత్ కంటున్న కలలను ఐఓసీ గుర్తించడం మాకు అత్యంత గర్వకారణం. రైజింగ్ టు గెదర్ అనేది కేవలం నినాదం కాదు, అంకితభావంతో కూడిన శక్తి.. అక్టోబర్ చివరి వరకు ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ముందు మా ఆశయాలను ప్రదర్శించడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని తెలిపారు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవ్య మాట్లాడుతూ.. క్రీడలు మన దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగలవు.. ఒలింపిక్స్ నిర్వహణ ద్వారా మిలియన్ల మంది యువతను క్రీడల వైపు ప్రోత్సహించవచ్చు.. దేశంలో ప్రతి సామాజిక వర్గానికి క్రీడా పరివర్తనను తీసుకురావడానికి ఇది దోహదపడుతుందని అన్నారు. త్వరలోనే ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ఎదుట భారత్ తన అధికారిక ప్రణాళికను ప్రదర్శించనుంది.

# ఆ విషయంలో జక్కన్న కంటే సుకుమార్ ఉత్తమంగా!

తెలుగు చలనచిత్ర పరిశ్రమను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడిగా రాజమౌళి స్థానం తిరుగులేనిది. తన ఊహాశక్తితో, విజువల్ వండర్స్‌తో -ఆర్‌ఆర్‌ఆర్- మూవీతో ఆస్కార్ వేదిక వరకు బాహుబలిలా జెండా పాతారు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడిగా రాజమౌళి స్థానం తిరుగులేనిది. తన ఊహాశక్తితో, విజువల్ వండర్స్‌తో -ఆర్‌ఆర్‌ఆర్- మూవీతో ఆస్కార్ వేదిక వరకు బాహుబలిలా జెండా పాతారు. అయితే దర్శకుడిగా వంద శాతం సక్సెస్ రేట్ ఉన్న రాజమౌళి సమర్పకుడిగా , ప్రొడ్యూసర్‌గా వస్తున్న సినిమాల విషయంలో మాత్రం అనుకున్న స్థాయిలో మ్యాజిక్ రిపీట్ చేయలేకపోతున్నారనే చర్చ సినీ వర్గాల్లో గట్టిగా నడుస్తోంది. తాజాగా ఆయన సమర్పణలో ఫహద్ ఫాసిల్ కథానాయకుడిగా రూపొందిన -డోంట్ ట్రబుల్ ది ట్రబుల్- సైతం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. గతాన్ని పరిశీలిస్తే రాజమౌళి సమర్పణ తోడైన చిత్రాల్లో -విశాఖ ఎక్స్‌ప్రెస్-, -రాజన్న-, -అందాల రాక్షసి-, -బ్రహ్మాస్త్ర- (తెలుగు వెర్షన్) వంటి సినిమాలున్నా? ఇవేవీ బాక్సాఫీస్ వద్ద పెద్ద సంచలనాలు నమోదు చేయలేకపోయాయి. రాజమౌళి బ్రాండ్ ఇమేజ్ వల్ల ప్రారంభ వసూళ్లు లభించినా? కంటెంట్ పరంగా ప్రేక్షకులను పూర్తిస్థాయిలో మెప్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఇదే కోవలో సొంత బ్యానర్ -సుకుమార్ రైటింగ్స్- ద్వారా సినిమాలను నిర్మిస్తున్న మరో దిగ్గజ దర్శకుడు







సుకుమార్ మాత్రం పూర్తి భిన్నమైన వ్యూహంతో దూసుకుపోతున్నారు. సుకుమార్ నిర్మాతగానే కాకుండా శిష్యులకు, యువ దర్శకులకు అవకాశాలు ఇస్తూ కథ, స్క్రీన్ ప్లే అందిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. -కుమారి 21ఎఫ్- మొదలైన విజయయాత్ర -ఉప్పెన-, -విరూపాక్ష- వంటి భారీ బ్లాక్‌బస్టర్ల వరకు నిరాటంకంగా కొనసాగింది. స్క్రిప్ట్ ఎంపిక చేయడం, కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడంలో సుకుమార్ తీసుకునే జాగ్రత్తలే ఆయన బ్యానర్‌ను సక్సెస్ రూట్‌లో ఉంచాయన్నది కాదనలేని నిజం. దర్శకుడిగా రాజమౌళి శిఖరాగ్రాన ఉన్నా? సమర్పకుడిగా.. నిర్మాతగా కంటెంట్ ఎంపిక, సక్సెస్ రేట్ విషయంలో మాత్రం జక్కన్న కంటే సుకుమారే మెరుగైన స్థానంలో ఉన్నార నడంలో సందేహం లేదు. ప్రత్యేకించి సుకుమార్ శిష్యులు గొప్ప దర్శకులుగా ఎదుగుతున్నారు. అతడి కాంపౌండ్ నుంచి వచ్చిన వారంతో సొంతంగా సినిమాలు చేస్తున్నారు. వాటికి సుకుమార్ ఏదో రూపంలో సహకారం అంది స్తున్నారు. కానీ ఇంత వరకూ రాజమౌళి స్కూల్ నుంచి బయటకు వచ్చి సక్సెస్ అయిన దర్శకులు లేరు. జక్కన్న వద్ద చాలా మంది పనిచేసారు. కానీ వాళ్లెవ్వరు సక్సెస్ అవ్వలేదు. తన అసిస్టెంట్..అసోసియేట్ దర్శకుల గురించి రాజమౌళి ఫోకస్డ్ గా చెప్పింది కూడా పెద్దగా లేదు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com